జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php




సంపుటి 7 సంచిక 273 | హైదరాబాద్, డిసెంబరు 13 బుధవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00



# పోలీసు శాఖలో కీలక బదిలీలు

## రేవంత్ సెక్రటరీగా ఐపిఎస్ అధికారి షా నవాజ్ ఖాసిం
## ట్రై కమిషనరేట్ల కొత్త పోలీసు బాస్‌లుగా
## కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, సుధీర్‌బాబు, అవినాశ్ మహంతి
## నార్కొటిక్ బ్యూరో డైరెక్టర్‌గా సందీప్ శాండిల్య
## ఐఎఎస్ అధికారులు కూడా పెద్ద ఎత్తున బదిలీ అయ్యే ఛాన్స్!?



హైదరాబాద్ : సిఎంగా రేవంత్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అటు ఆరు గ్యారంటీలలో రెండు గ్యారంటీలు అమలుతో పాటు .. ఇటు పాలనాపరమైన పలు చర్యలకు శరవేగంగా శ్రీకారం చుడుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే సిఎం రేవంత్ పాలనలో తనదైన ముద్ర కన బర్చే దిశగా దూకుడుగా దూసుకుపోతున్నారు. ఈ క్రమంలో పోలీస్ శాఖలో రేవంత్ సర్కార్ భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది.సిఎం రేవంత్‌రెడ్డి సెక్రటరీగా ఐపిఎస్ అధికారి షానవాజ్ ఖాసింను నియమించారు. ఈ మేరకు రేవంత్ సర్కార్ ఉత్తర్వులను జారీ చేసింది. ప్రస్తుతం షాన్‌వాజ్ ఖాసిం హైదరాబాద్ రేంజి ఐజిగా ఉన్నారు. మరోవైపు కీలకమైన హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, సైబరాబాద్ సిపిగా అవినాశ్ మహంతి, రాచకొండ సిపిగా సుధీర్‌బాబును నియమించింది. హైదరాబాద్ పాత సిపి సందీప్ శాండిల్యను నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్‌గా బదిలీ చేసింది.

(మిగతా 6లో..)

# గ్రేటర్ హైదరాబాద్‌పై సీఎం రేవంత్ సమీక్ష..

## హాజరైన ఎంఐఎం ఎమ్మెల్యేలు..

హైదరాబాద్: తెలంగాణలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పరిపాలనపై దృష్టి పెట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ అండ్ టీమ్.. పని మొదలు పెట్టి.. వరుసగా సమీక్షలు చేస్తోంది. తమతమ పరిధి లోని శాఖలపై పట్టు సాధించేందుకు.. సీఎం తోపాటు మంత్రులు వరుసబెట్టి సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే విద్యుత్ శాఖపై వరుసగా రెండ్రోజుల పాటు సమీక్ష చేసిన సీఎం రేవంత్.. ఇవాళ గ్రేటర్ హైదరాబాద్‌పై రివ్యూ చేశారు. మూసీ ప్రక్షాళన, నది పరిసరాల్లో అక్రమ నిర్మాణాలు.. తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులతో పాటు ఎంఐఎం ఎమ్మెల్యేలూ హాజరయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ అభివృద్ధిపై చర్చించి.. రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. టీఎస్ పీఎస్సీ ప్రక్షాళనపై ఫోకస్ పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి .. ఆ అంశంపై ఉదయం అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. పోటీ పరీక్షల తేదీలను రీషెడ్యూల్ చేయాలని యోచిస్తున్న సీఎం.. ఈనెల 17న తెలంగాణ జెన్‌కో పరీక్షలను వాయిదా వేయాలని నిర్ణయించారు. జాబ్ క్యాలెండర్‌కు అనుగుణంగా మార్పులు చేయాలని భావిస్తున్న ప్రభుత్వం.. త్వరలోనే గ్రూప్-2 పరీక్ష రీషెడ్యూల్ చేసే అవకాశం ఉంది. 2లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీకి అనుగుణంగా.. జాబ్ క్యాలెండర్ విడుదలకు ప్లాన్ చేస్తున్నారు.

# సీఎంల ఎంపికలో ఖతర్నాక్ వ్యూహం..

## చత్తీస్‌ఘఢ్‌లో ఆదివాసీ, మధ్యప్రదేశ్‌లో బీసీ, రాజస్థాన్‌లో ఓసీకి సీఎం పదవి



ఢిల్లీ: మూడు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి ఎంపిక విషయంలో భారతీయ జనతా పార్టీ ఖతర్నాక్ వ్యూహాన్ని అమలు చేసింది. అన్ని వర్గాలను ఆకట్టుకునేవిధంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్‌ల్లో సీఎంల ఎంపిక జరిగింది. ఉత్తరాదిలో ఓబీసీ ఓటు బ్యాంక్‌పై ప్రధానంగా బీజేపీ గురిపెట్టింది. అందుకే మధ్యప్రదేశ్ సీఎం పదవిని మోహన్ యాదవ్‌కు కట్టబెట్టారు. దీని ప్రభావం ఉత్తర ప్రదేశ్, బీహార్‌లో గట్టిగా ఉంటుందని బీజేపీ హైకమాండ్ భావిస్తోంది.మూడు రాష్ట్రాల సీఎం పదవికి బీజేపీ ఖరారు చేసిన పేర్లను బట్టి చూస్తే 2024 లోక్ సభ ఎన్నికల ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. మూడు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల పేర్లను ప్రకటించడంతో పాటు.. 2024కి రాజకీయ రంగం సిద్ధం చేసేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. అంతేకాకుండా, ఈ రాష్ట్రాల్లో కుల సమీకరణాలు సృష్టించాలని కూడా బీజేపీ కన్నేసింది.రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 400కు పైగా స్థానాల్లో విజయం సాధించాలన్న లక్ష్యాన్ని భారతీయ జనతా పార్టీ పెట్టుకుంది. ఎవరు ఊహించని విధంగా మూడు రాష్ట్రాల్లో అందుకే ముఖ్యమంత్రులుగా కొత్త ముఖాలను తెరపైకి తెచ్చారు. బ్రాహ్మణ ఓటు బ్యాంక్ కూడా ఉత్తరాదిలో కీలకం. అందుకే రాజస్థాన్‌లో బ్రాహ్మణ సామాజిక వర్గానికి సీఎం పదవి ఇచ్చారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్,చత్తీస్‌ఘడ్, ఉత్తరప్రదేశ్, బీహార్ కలిపి నార్త్‌బెల్ట్‌లో 200కు పైగా లోక్‌సభ సీట్లు ఉన్నాయి. అందుకే సీఎంల ఎంపికలో సామాజిక వర్గాలను ఎక్కువగా పరిగణ లోకి తీసుకున్నారు.

ఎంపీ సీఎంగా మోహన్ యాదవ్

మధ్యప్రదేశ్‌లో కుల సమీకరణాలతో రాజకీయాలు ఎక్కువ. ముఖ్యంగా కాంగ్రెస్ ఓబీసీ సమస్యను నిరంతరం లేవనెత్తుతోంది. అటువంటి పరిస్థితిలో, మధ్యప్రదేశ్‌లో మోహన్ యాదవ్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రిని చేయడం ద్వారా జనంలో ఆదరణ పొందడంతో పాటు, ఒక వైపు కాంగ్రెస్‌కు బీజేపీ సమాధానం ఇచ్చినట్లైంది. మరోవైపు ఓబీసీ ఓట్లను రాబట్టేందుకు కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. (మిగతా 2లో..)

## టీఎస్ జెన్‌కో ఏఈ పరీక్షలు వాయిదా..



హైదరాబాద్,: తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ (టీఎస్ జెన్‌కో) అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల రాత పరీక్షణను వాయిదా వేసినట్లు యజమాన్యం ప్రకటించింది. టీఎస్ జెన్‌కో అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టుల కోసం అక్టోబర్ 4వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టులకు డిసెంబర్ 17వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నది. అదే రోజున ఇతర పోటీ పరీక్షలు ఉన్నందున జెన్‌కో నిర్వహించే ఏఈ రాత పరీక్షను వాయిదా వేయాల్సిందిగా పలువురు అభ్యర్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణితో పాటు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కూడా కలిసి పరీక్షలను వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. పరీక్ష నిర్వహణపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించిన అనంతరం అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు జెన్‌కో పరీక్షను వాయిదా వేసేందుకు డిప్యూటీ సీఎం భట్టి అంగీకరించారు. తదుపరి రాత పరీక్ష షెడ్యూల్‌ను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.

# నేనే వస్తా.. ఎవ్వరూ రావద్దు.. కేసిఆర్ వినతి



హైదరాబాద్: సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పలువురు రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు పరామర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ ఆరోగ్యం గురించి ఆయన అభిమానులు ఆందోళన చెందుతున్నారు.. వారుసైతం యశోద హాస్పటల్‌కు వెల్లువలా తరలి వస్తున్నారు. తమ నేతను చూసేందుకు గంటల తరబడి అక్కడే నిరీక్షిస్తున్నారు. ఈ క్రమంలో కేసీఆర్ తనను చూసేందుకు యశోద ఆస్పత్రికి ఎవ్వరు రావద్దు అంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలా రావటం వల్ల తనతో పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఇబ్బంది కలుగుతోందని, ఎవ్వరూ రావద్దని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. ఆ వీడియోలో "తన వల్ల.. ఇతర రోగులు ఇబ్బందులు పడకూడదన్నారు. ఇన్ ఫెక్షన్ వస్తుందని డాక్టర్లు చెబుతున్నారని కాబట్టి ఎవ్వరు ఆస్పత్రికి రావద్దని కోరారు. తాను త్వరలోనే కోరుకుని ప్రజల ముందుకు వస్తానని తెలిపారు కేసిఆర్.

## తెలంగాణ బీజేపీలో కీలక మార్పులు.?

# కిషన్ రెడ్డి తప్పుకోనున్నారా..?



హైదరాబాద్: బీజేపీ హైకమాండ్ తెలంగాణ కాషాయ పార్టీని ప్రక్షాళన చేయాలని భావిస్తోంది. కమలం పార్టీ రాష్ట్ర సారథిగా ఎన్నికలకు ముందు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని నియమించారు. బీజేపీ హైకమాండ్ ఒత్తిడితో పార్టీ పగ్గాలు చేపట్టిన కిషన్ రెడ్డి శక్తి మేర కష్టపడ్డారు. ఎన్నికల్లో 8 స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర పార్టీ పగ్గాలు ఇతరులకు ఇవ్వాలని కిషన్ రెడ్డి పార్టీ అధిష్టానానికి విన్నవించుకున్నారు. రాష్ట్ర పార్టీ బాధ్యతలు ఎవరికి అప్పగించాలనే దానిపై బీజేపీ హైకమాండ్ కసరత్తు మొదలుపెట్టింది.తెలంగాణ కాషాయ దళపతిగా ఎవరికి ఛాన్స్ ఇస్తారనే దానిపై పార్టీలో విస్తృత చర్చ కొనసాగుతోంది. పార్లమెంట్ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో కొత్తగా ఎటువంటి ప్రయోగాలు చేయకుండా కంటిన్యూ కావాలని ఓ వైపు యోచిస్తోంది. అయితే రాష్ట్ర నేతల మధ్య సమన్వయం లేకపోవడం పార్టీకి ఇబ్బందిగా మారింది. రాష్ట్ర స్థాయి నేతలు ఎవరికి వారు సోషల్ మీడియాలో సొంత పార్టీలో ప్రత్యర్థులను డీగ్రేడ్ చేస్తూ కామెంట్స్ పెట్టడం పార్టీకి తలనొప్పి వ్యవహారంగా మారింది. ఇక పార్టీ ఫుల్ టైమర్ గా పనిచేసిన రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మంత్రి శ్రీనివాస్ వెళ్లిపోయిన తర్వాత%ా% కొత్తగా ఎవరిని నియమించలేదు.దీంతో రాష్ట్ర పార్టీ నేతల సమన్వయం పెద్ద తలనొప్పిగా మారింది. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నారు. రాష్ట్ర పార్టీగా అధ్యక్షుడిగా అదనపు బాధ్యతలు మోస్తున్నారు. రాజ్యసభ సభ్యుడు డా లక్ష్మణ్ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులుగా, పార్లమెంటరీ బోర్డు సభ్యులుగా ఉన్నారు. ఇక ఎంపీ బండి సంజయ్.. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈటల రాజేందర్, బండి సంజయ్ మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. వీరందరిని పక్కన పెట్టి కొత్త నేతను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించాలని పార్టీ హైకమాండ్ భావిస్తున్నట్లు సమాచారం. (మిగతా 2లో..)

## బ్యాంకు ఫ్రాడ్ కేసుల్లో 150 మంది అరెస్ట్.. రాజ్యసభలో కేంద్ర మంత్రి



హైదరాబాద్: దేశంలో మోసాల కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఎంతో మంది బ్యాంకుల నుంచి కోట్లాది రూపాయల రుణాలు తీసుకుని ఎగ్గొడుతున్న సందర్భాలు చాలా ఉన్నాయి. బ్యాంకుల నుంచి పెద్ద పెద్ద వ్యాపారవేత్తలు రుణాలు తీసుకుని చెల్లించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇలాంటి వ్యాపారవేత్తలు, నేతలు బ్యాంకులకు వేల కోట్ల రూపాయల అప్పు ఉన్నారు. బ్యాంకులకు వారు తీసుకున్న రుణాలను చెల్లించని పక్షంలో వారిపై కేసులు నమోదు అవుతున్నాయి.

## ఎంబీబీఎస్ విద్యార్థులకు కొత్త పాఠ్య ప్రణాళిక.. రాజ్యసభలో వెల్లడించిన కేంద్రం



న్యూఢిల్లీ, : వైద్య విద్యార్థుల కోసం నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) కొత్త బోధన ప్రణాళికకు సంబంధించిన మార్గదర్శకాలను ఈ ఏడాది ఆగస్టు 1న జారీ చేసినట్టు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ తెలిపారు.

(మిగతా 2లో..)



## పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిఆర్ఓ కు వినతి

### ఐఎన్టియుసి,జిల్లా ఇన్చార్జ్ లోకేష్



ఆసిఫాబాద్ జిల్లా డిసెంబర్ 11 (ప్రజాపాలన,ప్రతినిధి) : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వంట కార్మికులకు 6 నెలల పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ సోమవారం ఐ,ఎన్,టి,,యు,సి, జిల్లా ఇన్చార్జ్ అల్లూరి లోకేష్ కార్మికులతో కలిసి ఆర్డీవో కదం సురేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు, గౌరవ వేతనాలు రావడంలేదని, దీనితో నిర్వహణ భారంగా మారుతుందని, అల్పాహార పథకంతో వారిపై మరింత భారం పెరిగిందని పేర్కొన్నారు. మార్కెట్లో అత్యవసర విపరీతంగా పెరిగాయని, ప్రభుత్వం ఇచ్చే నిధులతో అల్పాహారం అందించడం కష్టంగా మారుతుందని వాపోయారు. అధికారులు స్పందించి వెంటనే పెండింగ్ బిల్లులు ఇప్పించి ఆదుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాపర్తి సత్యనారాయణ, గిరి కుమార్, వెంకన్న, శ్రీనివాస్, సుగుణ, కళావతి, రేణుక,తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ విద్యార్థులకు కొత్త పాఠ్య ప్రణాళిక.. రాజ్యసభలో వెల్లడించిన కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యసభలో మంగళవారం వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా సమాధానమిస్తూ.. కొత్త బోధన ప్రణాళిక కింద వృత్తిపరంగా మొదటి సంవత్సరంలో "కుటుంబ దత్తత కార్యక్రమం-లక్ష్యాలు అందుకోవడం" అనే పాఠ్యాంశంలో భాగంగా విద్యార్థులు ఆయా ప్రాంతాలకు సంబంధించిన గ్రామీణ స్థితిగతులను అర్థం చేసుకోవాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. కాంపిటెన్సీ బేస్డ్ మెడికల్ ఎడ్యుకేషన్ పేరిట రూపొందించిన ఈ కొత్త బోధనా ప్రణాళికకు సంబంధించిన మార్గదర్శకాలు జాతీయ మెడికల్ కమిషన్ వెబ్సైట్లో అందుబాటులో ఉంచినట్లు మంత్రి పేర్కొన్నారు.

## దేశంలోనే బెస్ట్ సిటీ హైదరాబాద్.. వరుసగా ఆరోసారి టాప్!



హైదరాబాద్ : విశ్వ నగరంగా దూసుకెళ్తున్న హైదరాబాద్ నగరానికి మరో అరుదైన గుర్తింపు దక్కింది. దేశంలో మెరుగైన జీవన ప్రమాణాలు కలిగిన నగరాల జాబితాలో హైదరాబాద్ నిలిచింది. ఈ మేరకు మెర్సర్స్ క్వాలిటీ ఆఫ్ లివింగ్ ర్యాంకింగ్స్ 2023లో వెల్లడించింది. ఆ తర్వాతి స్థానాల్లో పుణె, బెంగళూరు, చెన్నై నగరాలు నిలిచాయని పేర్కొంది.ప్రపంచవ్యాప్తంగా మెరుగైన జీవన ప్రమాణాలు కలిగిన నగరాల జాబితాను క్వాలిటీ ఆఫ్ లివింగ్ రిపోర్ట్ పేరిట మెర్సర్స్ కంపెనీ విడుదల చేసింది. ఇందులో వియన్నా ( ఆస్ట్రియా) తొలి స్థానంలో నిలిచింది. ఈ నగరానికి ఉన్న ఘనమైన చరిత్ర, అద్భుతమైన కట్టడాలు, సాంస్కృతికత వంటి వివిధ కారణాలతో వియన్నా అత్యంత జీవన ప్రమాణాలు కలిగిన నగరంగా నిలిచింది. వియన్నా తర్వాత రెండో స్థానంలో జురిచ్ (స్విట్జర్లాండ్), మూడో స్థానంలో ఆక్లాండ్ (న్యూజిలాండ్) నిలిచాయి. భారత్ విషయానికొస్తే ఈ జాబితాలో హైదరాబాద్ ( 153వ స్థానం) అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత పుణె (154) రెండో స్థానం, బెంగళూరు (156) మూడో స్థానం, చెన్నై ( 161) నాలుగో స్థానం, ముంబై (164) ఐదో స్థానం, కోల్కతా (170) ఆరో స్థానం, న్యూఢిల్లీ (172) ఏడో స్థానంలో నిలిచాయి. ఇక ఈ ర్యాంకింగ్స్‌లో ఖార్టూమ్(సూడాన్) 241వ ర్యాంక్‌తో అట్టడుగున నిలిచింది. ఆ తర్వాత ఇరాక్‌లోని బాగ్దాద్ 240వ ర్యాంకులో ఉంది. ఇక ఆఫ్రికన్ నగరాలైన ఎన్.జమీనా(చాడ్), బంగూయి( సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్) నగరాలు 236, 239 ర్యాంకులతో ఉన్నాయి.

హైదరాబాద్ వాసులకు కంగ్రాట్స్ : కేటీఆర్

మెర్సర్ జాబితా ప్రకారం హైదరాబాద్ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ 2015 నుంచి వరుసగా ఆరోసారి ఈ ఘనత సాధించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగరవాసులకు శుభాకాంక్షలు తెలిపారు.

## రూ.45 కోట్లు చెల్లించాలంటూ ఫైనాన్స్ కార్పొరేషన్ నోటీస్

ఆర్మూర్ : మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి మరో షాక్ తగిలింది. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి తీసుకున్న రూ. 20 కోట్ల రుణాన్ని వడ్డీతో సహా చెల్లించాలని జీవన్ రెడ్డికి అధికారులు నోటీసులు జారీ చేశారు. నిజామాబాద్ జిల్లా, ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఉన్న ఆయన ఇంటికి అధికారులు నోటీసులు అంటించారు. ఆయన ఈ రుణాన్ని 2017లో తన భార్య రజితా రెడ్డి పేరుమీద తీసుకున్నారు. అప్పుడు తీసుకున్న 20 కోట్ల అప్పు వడ్డీతో కలసి 45 కోట్లు అయింది..రుణ చెల్లింపులపైఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా ఇప్పటి వరకు చెల్లించలేదని అధికారులు పేర్కొన్నారు. దీంతో మరోసారి నోటీస్ జారీ చేసిన అధికారులు చట్టపరమైన చర్యలు చేపట్టేందకు సిద్దమవుతన్నారు..కాగా, నియోజకవర్గంలో ఉన్న జీవన్ రెడ్డి షాపింగ్ మాల్ కు గత కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడతో ఆ శాఖ నోటీసులు జారీ చేసింది.. జరిమానాతో సహా మొత్తం ఏడు కోట్లు చెల్లించాలని ఆ నోటీసులో పేర్కొంది..

# రాజకీయ చాణిక్యుడు శరత్ పవార్ కి జన్మదిన శుభాకాంక్షలు

**మరాఠ లో జన్మించిన పవార్ నేటి దేశ రాజకీయంలో ముక్యుడై ప్రతిపక్ష కూటమిని నడిపిస్తున్నాడు.**




హైదరాబాద్: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు శరత్ పవార్ జీ 83 వ జన్మదినం సందర్భంగా పార్టీ అధికారప్రతినిధి వైద్య ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు జేశారు ఈ సందర్బంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆనంతరం విలేకర్ల తో మాట్లాడుతా జగన్మాతా ఆశీస్సులు తో నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని భవంతుడుని కోరుకుంటున్నాం అని తెలిపారు నేటి దేశ రాజకీయాలకి పవార్ జీ చాలా అవసరం అని అన్నారు. నేడు దేశ రాజకీయాల్లో భాజపా చేస్తున్నా విభజించి పాలించు అనే విధానాన్ని వ్యక్తిరేకిస్తూ ప్రతిపక్ష లా కూటమి ఇండియా కి పెద్ద దిక్కులా నిలిచి తన అనుభవంతో ముందు తీసుకవెళ్తున్నారని అన్నారు.మరి కొన్ని సంవత్సరాలు పవార్ గారు ప్రత్యేక్ష రాజకీయాలలో ఉండాలని నేటి యువ నాయకులకు వారి సలహాలు సూచనలు ఇస్తూ ముందుకు నడిపించాలని కోరుతున్నాం. 2024 సాధారణ ఎన్నికలలో పవార్ జీ ఆధ్వర్యంలో తప్పకుండ భాజపా ని ఓడించి ఇండియా కూటమి ప్రభుత్వంని ఏర్పాటు చేస్తుంది దాని కోసం అన్ని రాష్ట్ర లా ఎన్సీపీ నాయకులు సిద్ధంగా వున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి కుమార్ కందుకూరి,రంజిత్ దొంతుల, నర్సింహానాయక్, రవి భైరి,సాయి, సుతారి రాము తదితరులు

## సీఎంల ఎంపికలో ఖతర్నాక్ వ్యూహం..

(మొదటి పేజీ తరువాయి)

మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో ఓబీసీ ఓటు చాలా ముఖ్యమైనదిగా పరిగణించడం గమనార్హం. అటువంటి పరిస్థితిలో, మోహన్ యాదవ్‌ను ముందుకు తెచ్చి, హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ అద్భుతమైన రాజకీయ పిచ్‌ను సిద్ధం చేసింది.

రాజస్థాన్‌లో ముఖ్యమంత్రిగా భజన్‌లాల్ శర్మ

అదే సమయంలో రాజస్థాన్‌లో భజన్‌లాల్ శర్మను ముఖ్యమంత్రిగా బీజేపీ ప్రకటించింది. దీంతో పాటు రాష్ట్రంలోని బ్రాహ్మణ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ఆ పార్టీ ప్రయత్నించింది. గణాంకాల ప్రకారం, రాజస్థాన్‌లో 89 శాతం హిందువుల జనాభా ఉంది. వీరిలో షెడ్యూల్డ్ కులాల జనాభా 18 శాతం కాగా, షెడ్యూల్డ్ తెగల జనాభా 13 శాతం. బ్రాహ్మణుల జనాభా దాదాపు ఏడు శాతం. అటువంటి పరిస్థితిలో, భాజన్‌లాల్ శర్మను ముందుకు తెచ్చి బ్రాహ్మణ ఓటర్లను ప్రలోభపెట్టడానికి బీజేపీ ప్రయత్నించింది. తన పటిష్టమైన ఓటర్లపై తన పట్టును కొనసాగించేందుకు, బీజేపీ బ్రాహ్మణ వ్యక్తిని ముందుకు తెచ్చింది.

ఛత్తీస్‌గఢ్‌లో విష్ణు దేవ్‌సాయిని ముఖ్యమంత్రిని చేసిన బీజేపీ

ఛత్తీస్‌గఢ్‌లో గిరిజన ఓటర్లపై కన్నేసి ఉంచిన బీజేపీ గిరిజన ఓటర్లపై పట్టు పెంచుకునేందుకు విష్ణు దేవ్‌సాయిని ముఖ్యమంత్రిగా ప్రకటించింది భారతీయ జనతా పార్టీ హైకమాండ్. ఛత్తీస్‌గఢ్‌లో గిరిజన ఓటర్లను నిర్ణయాత్మకంగా పరిగణిస్తారు. ఇక్కడి జనాభాలో దాదాపు మూడింట ఒక వంతు మంది గిరిజనులు. 90 అసెంబ్లీ స్థానాలున్న రాష్ట్రంలో 29 స్థానాలు షెడ్యూల్డ్ కులాలకు రిజర్వ్ చేయడం జరిగింది. ఇది కాకుండా రాష్ట్రంలో 11 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఇందులో 4 సీట్లు గిరిజన వర్గానికి రిజర్వ్‌గా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే గిరిజన సామాజికవర్గం నుండి ముఖ్యమంత్రిని చేసేందుకు ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ చేసిన ఎత్తుగడ గిరిజన సామాజిక వర్గానికి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో నివసించే జార?ండ్, ఒడిశా వంటి రాష్ట్రాలపై కూడా ప్రభావం చూపుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

తెలంగాణలోనూ బీసీ మంత్రం

అటు తెలంగాణలోనూ బీసీ, ఎస్సీ ఓటర్లకు గాలం వేసేందుకు బీజేపీ ప్రయత్నించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అకస్మాత్తుగా వ్యూహం మార్చిన బీజేపీ బీసీలకు సీఎం పదవి ఇస్తామని హామీ ఇచ్చింది. జనాభా పరంగా తెలుగు నేల బీసీలు 50 శాతానికి పైగానే ఉన్నప్పటికీ రాజకీయ చైతన్యం ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోల్చితే తక్కువేనని అభిప్రాయం ఉంది. వివిధ పార్టీలలో బీసీ నాయకులకు పదవులు లభించినా ముఖ్యమంత్రి స్థాయిలో ఎవరూ ఎదగలేదు. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో బీసీ మంత్రంతో పాగా వేసేందుకు బీజేపీ ప్రయత్నించింది.

## బ్యాంకు ఫ్రాడ్ కేసుల్లో 150 మంది అరెస్ట్.. రాజ్యసభలో కేంద్ర మంత్రి

(మొదటి పేజీ తరువాయి)

ఇక వాటిని రికవరీ చేసేందుకు బ్యాంకులు, ఈడీ అధికారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇలాంటి కేసులు దేశంలో చాలా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రిత్వశాఖ రాజ్యసభలో కీలక విషయాలను వెల్లడించింది. దేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 1,105 బ్యాంక్ ఫ్రాడ్ కేసులను చేపట్టిందని, ఇందులో రూ. 64,920 కోట్ల విలువైన క్రైమ్ రాబడిని అటాచ్ చేసి, 150 మందిని అరెస్టు చేసినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరాద్ రాతపూర్వక సమాధానంలో వివరణ ఇచ్చారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల నుండి రూ. 25 లక్షలు, అంతకంటే ఎక్కువ రుణాన్ని కలిగి ఉన్న ఉద్దేశపూర్వక ఎగవేతదారుల సంఖ్య 2019 జూన్ చివరి నాటికి10,209 కేసులు ఉండగా, మార్చి 2023 చివరి నాటికి 14,159కి పెరిగిందని చెప్పారు.ప్రైవేట్ రంగ బ్యాంకుల విషయానికొస్తే, జూన్ 2019 చివరినాటికి 1,950 డిఫాల్టర్ కేసులు ఉండగా, మార్చి 2023 చివరి నాటికి ఆ సంఖ్య 2,504కి పెరిగింది. "డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నుంచి అందిన ఇన్‌పుట్ల ప్రకారం.. మనీలాండరింగ్ నిరోధక చట్టం, 2002 నిబంధనల ప్రకారం దర్యాప్తు కోసం ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు సంబంధించిన వాటితో సహా దాదాపు 1,105 బ్యాంక్ మోసం కేసులను స్వీకరించింది. పీఎంఎల్‌ఏ నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దీని ఫలితంగా సుమారు రూ. 64,920 కోట్ల రాబడి అటాచ్‌మెంట్ చేసినట్లు మంత్రి కరాద్ తెలిపారు. ఈ ఫ్రాడ్ కేసులో మొత్తం 150 మంది నిందితులను అరెస్టు చేశామని, 277 ప్రాసిక్యూషన్ ఫిర్యాదులను ప్రత్యేక కోర్టు ముందు దాఖలు చేశామని ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరాద్ తెలిపారు.

## తెలంగాణ బీజేపీలో కీలక మార్పులు.?

# కిషన్ రెడ్డి తప్పుకోనున్నారా..?

(మొదటి పేజీ తరువాయి)

గతంలో బండారు దత్తాత్రేయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర సంస్థాగత కార్యదర్శిగా పనిచేసి మహారాజ్ గంజ్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ తర్వాత బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. ఇటీవల మధ్యప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా విష్ణుదత్త శర్మను నియమించింది. ఇతను ఏబీవీపీ జాతీయ సంఘటన కార్యదర్శి, ఫుల్ టైమర్ గా పనిచేశారు. అదేతరహాలో తెలంగాణ బీజేపీ పగ్గాలు%ౌ% గతంలో ఇక్కడ రాష్ట్ర సంఘటన కార్యదర్శిగా పనిచేసిన మంత్రి శ్రీనివాస్‌కు ఇస్తే ఎలా ఉంటుందనే దానిపై జాతీయ పార్టీ కసరత్తు చేస్తున్నారు. చండిఘడ్ కేంద్రంగా పంజాబ్ సంఘటన కార్యదర్శిగా పనిచేస్తున్న మంత్రి శ్రీనివాస్ కు రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగిస్తారా ? కొత్త ప్రయోగం చేస్తారా ? లేదా అన్నది చూడాలి.మరోవైపు మధ్యప్రదేశ్ బీజేపీ ఇంఛార్జ్ గా ఉన్న మురళీధర్ రావు కూడా రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. మొత్తంగా పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో పార్టీ హైకమాండ్ ప్రయోగం చేస్తుందా ? లేదా ? అన్నది చూడాలి.

## ప్రజలు చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారు: డిప్యూటీ సీఎం భట్టి



ఖమ్మం డిసెంబర్ 12 ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలిచిన అనంతరం కుటుంబ సమేతంగా తిరుపతి శ్రీవారి ఆశీస్సుల నిమిత్తం వెళ్లారు. వారు మాట్లాడుతూ తిరుపతి శ్రీవారి ఆశీస్సులు నిత్యం తెలుగు రాష్ట్రాలపై ఉండాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క తెలిపారు. తిరుమల శ్రీవారిని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాతూ తెలంగాణ ప్రజలు చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారని ప్రశంసించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీ నెరవేరుస్తామన్నారు. దేశంలో ఎవరూ ఉచిత కరెంట్ ఆలోచన చేయని రోజుల్లోనే వైఎస్ ఆర్ అమలు చేశారన్నారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పెటెంట్ అని గొప్పగా చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ 64 సీట్లు గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తెలంగాణకు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి సేవలందిస్తున్నారు అని అన్నారు.

## వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు శుభాకాంక్షలు వెల్లువ



వైరా డిసెంబర్ 12 ప్రజాపాలన ప్రతినిధి: వైరా నియోజకవర్గ శాసనసభ్యులు రాందాస్ నాయక్ ను జూలూరుపాడు ఎంపీడీవో వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జూలూరుపాడు కార్యాలయ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శుభాకాంక్షలు తెలియజేసిన ఎంపీడీవో కి పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ జూలూరుపాడు మండల పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేయాలని ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కలగకుండా చూడాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యోగస్తుల సమస్యలు తీరుతాయని పంచాయతీ కార్యదర్శులకు న్యాయం కాంగ్రెస్ ప్రభుత్వం చేకూరుతుందని అన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి: వైద్యులు సురేష్



కారేపల్లి డిసెంబర్ 12 ప్రజాపాలన ప్రతినిధి: కారేపల్లి మండలం పిహెచ్సి ఆసుపత్రి యందు డాక్టర్ సురేష్ కుమార్ , వైద్యురాలు శ్రేష్ట ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో ఆశ వర్కర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వైద్యులు 41 గ్రామపంచాయతీల పరిధిలోనే సమస్యలను ఆశలు, ఏఎన్ఎం ల ద్వారా అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో ప్రధానంగా సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గ్రామాలలో ప్రధానంగా దోమ నివారణ కు తగిన చర్యలు తీసుకోవాలని ప్రతి ఇంటి ఆవరణంలో తడి, పొడి చెత్త లాంటి పదార్థాలు ఉంచరాదని వాటి వల్ల కలిగే అనేక ప్రయోజనాలు ఇబ్బంది సమస్యలు తలెత్తుతాయని అన్నారు. దోమల నియంత్రణలో ప్రజల అప్రమత్తంగా ఉండాలని దోమకార్డుకు గురైతే సీజనల్ వ్యాధులలో ప్రధానంగా డెంగ్యూ, టైఫాయిడ్ ,మలేరియా వంటి వ్యాధులు వస్తాయని అన్నారు. దోమలను ఎప్పటికప్పుడు ఆవారణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రధానంగా గర్భిణీలు తొమ్మిది నెలల పాటు పౌష్టికాహార పదార్థాలు తీసుకోవాలని వైద్యశాలలో అందించే చికిత్స తప్పక చేయించుకోవాలని అన్నారు. ఇంటి ఆవరణంలో రబ్బర్ టైర్లను, మురికి వాటర్ ను ఉంచరాదని అన్నారు. గ్రామాలలో ఆరోగ్య సమస్యలు తలెత్తుతే పిహెచ్ఈ నందు సంప్రదించి వైద్య సహాయం పొందాలని కోరారు.

## ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ను కలిసిన తెలంగాణ బీసీ జాగృతి సభ్యులు



మంచిర్యాల టౌన్, డిసెంబర్ 12, ప్రజాపాలన : తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం బెల్లంపల్లి చౌరస్తా లోని సర్కిల్ లో మహాత్మ జ్యోతి రావు పూలే విగ్రహా ఏర్పాటుకు అనుమతి ఇప్పించవలసిందిగా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్ పట్టణ అధ్యక్షులు వైద్య భాస్కర్ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్ కోశాధికారి సల్ల విజయకుమార్ పట్టణ కార్యదర్శులు గుమ్ముల శ్రీనివాస్ బద్ది శ్రీనివాస్ పట్టణ కమిటీ సభ్యులు చంద్రగిరి శంకర్ నరెడ్ల జై తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులని ప్రభుత్వం ఆదుకోవాలి

**ఉద్యమకారుల సంఘం నాయకులు**



ఆసిఫాబాద్ జిల్లా డిసెంబర్ 12 (ప్రజాపాలన,ప్రతినిధి) : "మలి దశ" తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యమకారుల సంఘం నాయకులు రూప్నర్ రమేష్, కొండ్ర రాజేశ్వర్, భోగి ఉపేందర్, సావిత్రి, చిరంజీవి, బాబురావు, అశోక్, ఉత్తం నాయక్, తదితరులు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్ పార్క్ లో ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారులు అత్యంత కీలక పాత్ర పోషించారని అన్నారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉద్యమాన్ని అణచి వేసేందుకు అక్రమ కేసులు పెట్టిందని, దీనివల్ల విద్యార్థులు, యువకులు, యువతులు, ఉద్యమకారులు ఆర్థికంగా అనేక విధాలుగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్ది కాలంలో రాష్ట్రంలో ఉద్యమాకారులను గుర్తించలేదని, అక్రమ కేసుల వలన ఉద్యోగ అవకాశాలు కోల్పోయి, ఆర్థికంగా నష్టపోయారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించాలని, అలాగే వీరికి ప్రతినెల గౌరవ భృతి కింద రూ 25 వేలు చెల్లించాలని అన్నారు. ఉచిత బస్సు పాస్ సౌకర్యం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు తో పాటు 250 చదరపు గజాల స్థలం, 5 ఎకరాల సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు,

## పంచాయతీ రాజ్ శాఖ మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా పంచాయతీ అధికారులు



హైదరాబాద్ 12 డిసెంబర్ ప్రజాపాలన: తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి. శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ను వివిధ జిల్లా పంచాయతీ అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మరియు మేడ్చల్ జిల్లా పంచాయతి అధికారి రమణ మూర్తి అలాగే, వివిధ జిల్లాల పంచాయతీ అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## అంగరంగా వైభవంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



కుత్బుల్లాపూర్, (ప్రజా పాలన ) : కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని కుత్బుల్లాపూర్ లో అరుణ్ గురుస్వామి పర్యవేక్షణలో గురు స్వామి హరిబాబు ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దైవారాధనతో విఘ్నాలు తొలగి కార్యసిద్ధి జరగడంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు - ప్రజల విశ్వాసాలతో ఉన్నాయన్నారు.. ఈ మహా పడిపూజ కార్యక్రమంలో స్థానికులు, అయ్యప్ప భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# పార్కింగ్ స్థలాలు లేక వాహనదారుల ఇక్కట్లు

## సెల్లార్లలో షాపుల నిర్వహణతో ఇబ్బందులు

## సిబ్బంది కొరతతో తప్పని తిప్పలు

## సిబ్బందిని పెంచితేనే తొలగనున్న సమస్య



మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 11: మానుకోట జిల్లా కేంద్రం కావడం.. రోజురోజుకు విస్తరిస్తుండడం.. గ్రామాలు పట్టణంలో విలీనం కావడం.. వీటికి తోడు లక్షకు చేరువైనప్పటికీ మహబూబాబాద్ పట్టణా న్ని ట్రాఫిక్ సమస్య వెంటాడుతూనే ఉంది. రోజురోజుకు పెరుగుతున్న జనాభా, వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నా అది మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. పట్టణ విస్తరణ, జంక్షన్ల ఏర్పాటు, వాహనాల రద్దీ ని దృష్టిలో పెట్టుకుని సిబ్బందిని కేటాయించాల్సి ఉండ గా ట్రాఫిక్ నియంత్రణకు తూతూ మంత్రంగా కొద్ది మంది సిబ్బందిని కేటాయించడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా కేంద్రంలో కనీసం 25 నుంచి 30 మంది సిబ్బంది అవసరముండగా కేవలం ఎస్సైతో పా టు 8 మంది సిబ్బందిని కేటాయించడంతో వారుషిఫ్ట్ ల వారీగా పరిమిత సెంటర్లలో మాత్రమే విధులు నిర్వహి స్తున్నారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కా రం లభించడం లేదు. విధులు పూర్తయ్యాక సి బ్బంది కనీసం విశ్రాంతి తీసుకోవడానికి జిల్లాలో ప్రత్యేకంగా పోలీస్‌స్టేషన్ కూడ లేక పోవడంతో పట్టణ పోలీస్‌స్టేష న్‌లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లా కేంద్రంలో పెరిగిన జనాభా.. వాహనాలు..

పాలన సౌలభ్యం దృష్ట్యా నాటి తెలంగాణ రాష్ట్ర ప్ర భుత్వం నూతన జిల్లాలో ఏర్పాటులో భాగంగా విజయ దశమి పర్వదినాన 11 అక్టోబరు 2016 సంవత్సరంలో 16 మండలాలతో మానుకోట జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఇనుగుర్తి, సీరోలు మండలాలు ఏ ర్పాటు చేయగా జిల్లాలో మొత్తం మండలాల సంఖ్య 18కి చేరుకుంది. ఇక నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే పూర్తి స్థాయిలో మానుకోట, డోర్నకల్ అసెంబ్లీ సెగ్మెంట్ లుండగా రెండేసీ మండలాల ప్రాతినిధ్య ఇల్లందు, పాల కుర్తి, ములుగు నియోజకవర్గాలున్నాయి. జిల్లా వ్యాప్తం గా 461 గ్రామ పంచాయతీలు, 18 మండలాలకు సం బంధించిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు వివిధ పనుల నిమిత్తం మానుకోట జిల్లా కేంద్రానికి వచ్చి పోతుంటారు. మరో పక్క జిల్లా కేంద్రం కావడంతో ఇక్కడ పనిచేసే ఉద్యోగులు పెరగడం, పట్టణం అభివృద్ధి చెందుతూ విస్తరించడం వల్ల అటు ప్రజలు, ఇటు వాహనాల రద్దీ రోజు రోజుకు పెరగడం, నిత్యం రాకపోకలతో పట్టణమంతా వాహనాల రద్దీ కనబడుతోంది.

పార్కింగ్ స్థలాలు లేక ఇక్కట్లు..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రతి రోజు వాహనాల రద్దీ పెరుగుతున్నప్పటికీ అనువుగా ఎక్కడా కూడ పార్కింగ్ స్థలాలు లేక వాహనదారులు ఇ బ్బందులు పడుతున్నారు. షాపింగ్ చేసిన సమయా ల్లో సమీపంలో రోడ్లపైనే పార్కింగ్ చేయడం వల్ల ఇటు ప్రజలకు ఇబ్బందులు కలుగడంతో పాటు వా హన యాజమానులకు ట్రాఫిక్ పోలీసులు వేస్తున్న ఫెనాల్టీలు పెరిగిపో తున్నాయి. జిల్లా కేంద్రంగా ఆవిష్కృతమైనప్పటికీ ప్రధాన రహదారుల్లో సైతం కొత్తగా నిర్మితమవుతున్న షాపింగ్ కాంప్లెక్స్‌లు సైతం వాహన పార్కింగ్ కోసం సెల్యూలార్ నిర్మించక పోవడంతో కూడ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒకటి, రెండు చోట్ల నిర్మించిన వాటిని వాహన పార్కింగ్‌కు ఉపయోగించకుండా షాపులను నిర్వహిస్తుండడంతో ఆయా కాంప్లెక్స్‌లో వివిధ పనుల నిమిత్తం వచ్చిన వాహనదారులు కూడ తమ వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఇక కొత్త బజారులోని నెహ్రూసెంటర్, తొర్రూరు బస్టాండ్ ప్రాంతంలో ద్విచక్రవాహనాలకు సెంట్రల్ పార్కింగ్ పెట్టినప్పటికి అక్కడ వాహనాలు నిండిపోయిన పిదప అక్కడ షాపులకు వచ్చే వాహన దారులు షాపుల ఎదుట నిలపడంతో ఆయా ప్రాంతా ల్లో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రైలు వచ్చిన సమయంలో ఇక పాత బజారులోని రైల్వేస్టేషన్ ప్రాంతం, మథర్‌థెరిస్సా సెంటర్‌లో వాహనాల రద్దీతో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు.

సిబ్బంది కొరతతో తప్పని ఇబ్బందులు..

జిల్లా కేంద్రంలో పూర్తి స్థాయిలో ట్రాఫిక్ సిబ్బందిని నియమించక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో ప్రధానంగా కొత్తబజారులోని నెహ్రూసెంటర్, పాతబజారులోని మథర్‌థెరిస్సా సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటితో పాటు మూడు కొట్ల సెంటర్, ఆర్యూబీ ప్రాంతం, ఇల్లందు బైపాస్ రోడ్, నర్సంపేట బైపాస్‌రోడ్, బస్టాండ్‌సెంటర్, ముత్యా లమ్మ గుడిసెంటర్‌లలో జంక్షన్‌లను ఏర్పాటు చేశారు. సిగ్నల్ పాయింట్లతో పాటు అన్ని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే మహబూబాబాద్‌లో ఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు, ఆరుగురు హోంగార్డులను ట్రాఫిక్ విభా గానికి కేటాయించారు. వారే జిల్లా కేంద్రమంతా ట్రాఫి క్‌ను నియంత్రించాల్సి ఉంటుంది. ఇందులో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఒక షిఫ్ట్, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 గంటల వరక మరో షిఫ్ట్‌లో వారు పని చేస్తారు. ఉదయం షిఫ్ట్‌లో నలుగురు. సాయంత్రం షిఫ్ట్‌లో మరో నలుగురు విధులు నిర్వహిస్తారు. దీంతో అన్ని కేంద్రాల్లో ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహించలేక పోతున్నారు. ఇక ఒకే ఒక్క ఎస్సై ఉదయం నుంచి రాత్రి వరకు విధులు నిర్వహించాల్సిన ధైన్య స్థితి నెలకొంది. దినదినాభివృద్ధి చెందిన మానుకోట జిల్లా కేంద్రంగా, పార్లమెం టరీ నియోజకవర్గ కేంద్రంగా ఎదిగిన వ్పటికి పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయక పోవడం, నియంత్రణకు సరిపడ సిబ్బందిని కేటాయించకపోవడంతో ట్రాఫిక్ సమస్య పరి ష్కారానికి నోచుకోవడం లేదు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి సీఐ స్థాయి అధికారిని నియమించి, పాత, కొత్త బజారులకు ఎస్సై స్థాయి అధికారు లు, సరిపడ సిబ్బందిని కేటాయించి సమస్యను పరిష్కరించాలని వాహనదా రులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆదిశగా ఉన్నతాధికారులు, పాలకులు ఆలోచించా లని కోరుతున్నారు.

## హైదరాబాద్ లో జీవించేవారు తెలంగాణ వారితో సమానం

**కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజా పాలన) : హైదరాబాద్ లో జీవించేవారు తెలంగాణ వారితో సమానమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ లోని ఫాక్స్ సాగర్ వద్ద గల రాధాకృష్ణ దేవాలయంలో ఒడియా అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సంధర్బంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరం విభిన్న సంస్కృతుల నిలయమన్నారు. అనంతరం ఒడియా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఇక్కడ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద సహాయ సహకారాలతో దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారన్నారు. ఈ రాధాకృష్ణ దేవాలయం నిర్మాణంలో సహాయ, సహకారాలు అందించిన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ను ఒడియా అసోసియేషన్ సభ్యులు శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గొంతుకై పనిచేద్దాం ..



సంగారెడ్డి, ప్రజాపాలన ప్రతినిధి : బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై ఇతర పార్టీలు దుష్ప్రచారాలు చేశాయని వాటిని ప్రజలు నమ్మారని, కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీల అమలు కోసం పోరాడుదాం, ప్రజల గొంతుకై ప్రతిపక్షంగా ముందుకు సాగుదామని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ కృతజ్ఞత సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రమంతా కొంత ఇబ్బంది ఉన్నా సంగారెడ్డిలో మాత్రం ఈ సారి గులాబీ జెండా ఎగిరింది. చింతా ప్రభాకర్ ఆరోగ్యం దెబ్బ తిన్నా ప్రతి ఒక్క కార్యకర్త అభ్యర్థిగా కష్టపడి పని చేశారని ప్రశంసించారు. అధికార పార్టీ వాళ్లు మన మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తారు. టీఆర్ఎస్ పార్టీ పెట్టినప్పుడు కూడా ఎన్నో ఇబ్బందులు పడ్డాం. అయినా ఇబ్బందులు ఎదుర్కొని ఎన్నో విజయాలు సాధించామన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ టిఆర్ఎస్ తో పొత్తు పెట్టుకుని తెలంగాణ ఇవ్వలేదు. తెలంగాణపై కేసీఆర్ కి ఉన్న ప్రేమ ఇతరులకు ఉండదని పేర్కొన్నారు. పద్నాలుగేండ్లు ఏండ్లు కష్టపడి, పదవులు గడ్డి పోచల్లా వదిలేసి తెలంగాణ సాధించుకున్నామని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు పొంగిపోలేదు..లేనప్పుడు కుంగిపోలేదు. బీఆర్ఎస్ అధికార పక్షంలో ఉన్నా ప్రతి పక్షంలో ఉన్నా మనమెప్పుడు ప్రజల పక్షమేనని స్పష్టం చేశారు. తెలంగాణాని అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలబెట్టింది బీఆర్ఎస్ పార్టీనేనని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. వాళ్లు మనకంటే బాగా చేయాలని కోరుకుందామన్నారు. ప్రజల సమస్యలపై పోరాడే వారికే భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. కార్యకర్తలు ఎవరు కూడా అధైర్య పడొద్దు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. అందరం కలసి పని చేద్దామని అన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం ఓడిపోయామని కుంగిపోవద్దు..వచ్చే పంచాయతీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ సత్తా చూపించాలని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, జడ్పి చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, మామిళ్ల రాజేందర్, దేవిప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ నరహరి రెడ్డి, నాయకులు ముకీం, హకీమ్, రాజేశ్వరరావు దేశ్పాండే, విజయేందర్ రెడ్డి, శివరాజ్ పాటిల్, ఆత్మకూర్ నాగేష్, డాక్టర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## నెట్ బాల్ పోటీలకు ఆదర్శ విద్యార్థులు

**ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్**



ఆసిఫాబాద్ జిల్లా డిసెంబర్ 12 (ప్రజాపాలన,ప్రతినిధి) : జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాల కు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ నెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10వ తరగతి విద్యార్థి మేకర్తి వంశీ వర్ధన్, ఇంటర్ ప్రథమ సం విద్యార్థి జంజిరాల అజయ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి "నెట్ వాల్" పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 15 నుండి 17 వరకు హర్యానా రాష్ట్రంలో జరగనున్న నెట్ బాల్ ఫెడరేషన్ కప్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొంటారని అన్నారు. విద్యార్థులను "నెట్ బాల్ జిల్లా అధ్యక్షులు అలీ బిన్ అమ్మద్" పిడి తిరుపతి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సన్మానించారు. అలీ బిన్ అమ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, నెట్ బాల్ కీడా అభివృద్ధికి కావలసిన సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, పిడి తిరుపతి, ఉపాధ్యాయులు,కమిటీ చైర్మన్ ప్రేమ్ కుమార్. పాల్గొన్నారు.

## ఈనెల 17న జిల్లా ట్రస్మా ఎన్నికలు

**ఎన్నికల అధికారి పెద్దపల్లి కిషన్ రావు**



ఆసిఫాబాద్ జిల్లా డిసెంబర్ 12 (ప్రజాపాలన,ప్రతినిధి) : ఈనెల 17వ తేదీ ఆదివారం తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాల యాజమాన్యల సంఘం (ట్రస్మా) ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి పెద్దపల్లి కిషన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం జిల్లా అధ్యక్షులుగా పి దేవభూషణం, ప్రధాన కార్యదర్శిగా ఎండి తాజుద్దీన్, వోలువోజు తిరుపతి ఒకరే నామినేషన్ దాఖలు చేయగా, పోటీకి ఎవరు లేనందున తిరుపతిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. కోశాధికారిగా దీకొండ సంజీవ్ కుమార్, తిరుపతిలో పోటీలో ఉన్నారు. ఈ ఎన్నికల నిర్వహణకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు, కార్యదర్శి మధుసూదన్ లు, మంచిర్యాల్ ట్రస్మా అధ్యక్షులు విష్ణువర్ధన్లు హాజరవుతున్నారని తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నికైన ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి వోలువోజు తిరుపతి ని ట్రస్మా మాజీ అసోసియేషన్ అధ్యక్షుడు చిలుకూరి రాధాకృష్ణ చారి తో పాటు జిల్లాలోని కరస్పాండెంట్లు అభినందించారు.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
సంపాదకీయం
బుధవారం 13, డిసెంబరు 2023

# ఆర్థిక వృద్ధి ఎగుమతులపై ఆధారపడితే వచ్చే చిక్కులు

ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా మొత్తం మార్కెట్ శక్తులకే విడిచిపెడితే విదేశీ మారక నిల్వల విషయంలో ఎప్పటికైనా సమతూకం సాధించడం సాధ్యమేనా అన్నది సందేహమే. కాని అటువంటి పరిస్థితి ఉత్పన్నం కాగానే ఆ దేశం ఐఎంఎఫ్ వద్దకు పోయి రుణం తీసుకుంటుంది. అప్పుడు ప్రైవేటు పెట్టుబడిదారులలో కొంత భరోసా ఏర్పడి వారి పెట్టుబడులను వెనక్కి తీసేసుకోకుండా కొనసాగిస్తారు. ఐతే తాను రుణం ఇవ్వడానికి ఐఎంఎఫ్ చాలా పెద్ద మూల్యం కోరుతుంది. సంక్షేమానికి చేసే ఖర్చులో కోతలు విధించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను ఎత్తివేయాలని, దేశ ఆస్తులను ప్రైవేటు, విదేశీ పెట్టుబడిదారులకు అప్పజెప్పాలని (దీనినే విజాతీయాకరణ అని ముద్దుగా అంటారు)–ఇలాంటి షరతులను విధిస్తుంది.దేశ ఎగుమతులను పెంచి తద్వారా ఆర్థికవృద్ధి సాధించడం అనే వ్యూహంపై ఆర్థికవేత్తల నడుమ గత ఏభై ఏళ్ళుగా చర్చ నడుస్తూనే వుంది. తూర్పు ఆసియా 'పులులు' సాధించిన 'అద్భుతాల'ను భారతదేశం వంటి నత్త నడకన వృద్ధి సాధిస్తున్న దేశాలతో పోల్చి 'ముడుచుకుపోయే' అభివృద్ధి వ్యూహం అనుసరించడమే మన వృద్ధి రేటు పెరగకపోవడానికి కారణం అని ప్రపంచబ్యాంక్ వ్యాఖ్యానించింది. ఈ మొత్తం చర్చలో వాస్తవ జీవితానికి సంబంధించి కీలక పాత్ర పోషించే ఒక విషయాన్ని మాత్రం విస్మరించారు.ఒక ఆర్థిక వ్యవస్థలో స్థూల డిమాండ్‌లో భాగంగా ఉండే వివిధ ఖర్చులలో కొన్ని పద్దులు స్వయంప్రతిపత్తితో ఉంటాయి. తక్కిన ఖర్చులు మొత్తం డిమాండ్ ఏ మేరకు పెరిగితే ఆ మేరకు అవి కూడా పెరుగుతాయి. ఎగుమతులు, ప్రభుత్వ వ్యయం స్వయంప్రతిపత్తి కలిగిన ఖర్చులు (ఎగుమతుల ఖర్చు అంటే ఎగుమతి చేసే సరుకులను ఉత్పత్తి చేయడం కోసం చేసే ఖర్చు. ఇది మన దేశానికి వెలుపల ఉండే డిమాండ్ బట్టి ఉంటుంది తప్ప మన దేశపు డిమాండ్ మీద కాదు). సరుకుల వినిమయం కోసం చేసే ఖర్చు వినిమయదారుల ఆదాయాల మీద ఆధారపడి వుంటుంది. ఐతే, కొన్ని సందర్భాలలో ఆదాయాలతో నిమిత్తం లేకుండా కూడా వినిమయ ఖర్చు ఉంటుంది. ఉదాహరణకు ఇంతవరకూ వినియోగదారులకు మార్కెట్‌లో లభించని ఏదైనా వస్తువు ఇప్పుడు మార్కెట్‌లో ఒక్కసారి లభిస్తూ వుంటే, దానిని కొనుగోలు చేయడానికి అందరూ సిద్ధపడతారు.ఒక ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌లో వృద్ధి, దానితోబాటు ఉత్పత్తిలో వృద్ధి స్వయంప్రతిపత్తి ఉన్న ఖర్చుల పెరుగుదల మీద ఆధారపడి వుంటుంది. నయా ఉదారవాద విధానాలను అమలు చేసే ఆర్థిక వ్యవస్థలో దేశాల ఎల్లలను అధిగమించి ద్రవ్య పెట్టుబడి సంచరిస్తూ వుంటుంది. అందుచేత అది ఆ యా దేశాల ఆర్థిక వ్యవస్థల మీద అనేకరకాలుగా ఒత్తిడులు తెచ్చి తాను విధించే పరిమితులకు లోబడి వ్యవహరించాలని ఒప్పిస్తుంది. జిడిపిలో ఒకానొక పరిమితిని దాటి ద్రవ్యలోటు ఉండరాదు అన్నది అటువంటి ఒక షరతు. అప్పుడు ఆ దేశం తన ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌ను పెంచడం కోసం చేయగల ప్రభుత్వ వ్యయాన్ని పెంచుకోడానికి చిక్కులెదురౌతాయి. సంపన్నులపై విధించే పన్నులను పెంచి తద్వారా లభించే అదనపు ఆదాయంతో ప్రభుత్వ వ్యయాన్ని పెంచుకోవచ్చు. కాని అందువలన ద్రవ్యలోటు పెరుగుతుంది. ద్రవ్యలోటు ఒకానొక పరిమితికి మించరాదన్న షరతు ఉంది కనుక సంపన్నుల మీద విధించే పన్నులను పెంచగల శక్తిని ప్రభుత్వం కోల్పోతుంది. మరి డిమాండ్ పెంచడానికి, తద్వారా వృద్ధిరేటు పెంచడానికి ఎగుమతులను పెంచడం వినా మరో దారి లేదు. అందుచేత నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థ ఎగుమతుల వృద్ధి మీద ఆధారపడి నడిచే వ్యవస్థగా ఉంటుంది.ఐతే నయా ఉదారవాద విధానాల చట్రానికి లోబడకుండా కూడా ప్రభుత్వం తన ఎగుమతులను పెంచి తద్వారా వృద్ధి సాధించవచ్చు. అటువంటి వృద్ధి సాధించడంలో ప్రభుత్వం కీలక పాత్ర పోషించి ఎగుమతులు పెరగడానికి తోడ్పడవచ్చు. చాలామంది తూర్పు ఆసియా దేశాల్లో జరిగిందిదే అని వాదిస్తారు.ఎగుమతులను పెంచుకోవడం ద్వారా వృద్ధి సాధించడం అనే వ్యూహాన్ని అమలు చేసే దేశాల్లో రెండు రకాలు ఉంటాయి. ఆ తేడాను మనం చూడాలి. మొదటి కేసులో ఒకానొక దేశం ఒక పథకం ప్రకారం తన ఎగుమతులను పెంచుకుంటూ, విదేశీ వాణిజ్యంలో మిగులును క్రమంగా పెంచుకుంటూపోవచ్చు. తద్వారా తన విదేశీ మారక నిల్వలను పెంచుకుంటూ పోవచ్చు. ఇందుకు చైనా ఒక ప్రధాన ఉదాహరణ. అటువంటి దేశాల విషయంలో, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఏవైనా ప్రతికూల మార్పులు చోటు చేసుకున్నా, వాటి ప్రభావం ఆ విదేశీ వ్యాపారం ద్వారా సమకూరిన నిల్వలు తగ్గడం వరకే పరిమితంగా ఉంటుంది. అందుచేత అటువంటి దేశాలు ఆ ప్రతికూల అంతర్జాతీయ పరిస్థితులను తట్టుకుని తేలికగానే బైటపడగలుగుతాయి.ఐతే, చాలా దేశాలు రెండో కోవకు చెందుతాయి. అవి నిరంతరం విదేశీ వ్యాపారంలో లోటును కలిగివుంటాయి. ఆ లోటును భర్తీ చేయడానికి ప్రైవేటు ద్రవ్య పెట్టుబడుల ప్రవాహం మీద ఆధారపడతాయి. ఒకవేళ విదేశీ మారకద్రవ్య నిల్వలలో మిగులును ఎప్పుడైనా సాధించినా, అందుకోసం అవి ప్రైవేటు రుణదాతల నుండి రుణాలు తీసుకుంటాయి. మన దేశం ఈ కోవకే చెందుతుంది. దక్షిణాసియా దేశాలన్నీ దాదాపు ఇదే కోవలో ఉంటాయి. మూడో ప్రపంచ దేశాల్లో చాలా దేశాలు కూడా ఇదే కోవలో ఉంటాయి.ఇటువంటి దేశాల విషయంలో విదేశీ వ్యాపార ఖాతాలో లోటు రకరకాల బాహ్య కారణాల వలన పెరగవచ్చు. కరోనా కాలంలో టూరిస్టుల రాక తగ్గిపోయినందువలన శ్రీలంకలో విదేశీ మారక ఆదాయం ఒక్కసారిగా పడిపోయింది. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా దిగుమతుల ధరలు పెరిగి పోవడం, ప్రపంచవ్యాప్త మాంద్యం కారణంగా ఎగుమతులకు ధరలు పడిపోవడం జరిగి బంగ్లాదేశ్ చిక్కుల్లో పడింది. అటువంటప్పుడు ఆ దేశానికి పెట్టుబడులను పంపించేవారు, ముఖ్యంగా రుణదాతలు వెనుకాడతారు. దాని వలన ఆ దేశపు చిక్కులు మరింత ఎక్కువ అవుతాయి. విదేశీ వ్యాపార లోటు మరింత పెరిగిపోతుంది. అప్పుడు దేశంలో ఉన్న ఆ కాస్త విదేశీ పెట్టుబడులు కూడా బైటకు ప్రవహించనారంభిస్తాయి.

**సామాజిక దృక్పథంతో మీరు రాసే రచనలు**
**editor. prajapalana@gmail.com**
**మెయిల్ కు పంపించినచో ప్రజా పాలన**
**దినపత్రికలో ప్రచురించబడును**

# గాడ్సే–సావర్కర్ అండ్ కో వక్రభాష్యం

గాంధీ, అంబేద్కర్, నెహ్రూ, పటేల్‌లు వైవిధ్యతను అంగీకరించే దేశం గురించి కలలుగంటుండగా సావర్కర్ గ గాడ్సే, ఇతర హిందూ జాతీయవాదులు మాత్రం గతమంతా ఘనమైనదని, అన్నీ పురాణాలు–వేదాల్లోనే వున్నాయని అదేపనిగా మాట్లాడారు. వారి వారసులు ఇప్పటికీ మాట్లాడుతూనే వున్నారు. వాస్తవానికి వారు చెప్తున్న గతంలో అసమానతలనేవి పుట్టుక ఆధారంగా అంతర్నిర్మితంగా ఉన్నాయి. హిందూ మితవాద శక్తులు రోజురోజుకూ దఢంగా, శక్తివంతంగా మారుతున్నాయి. వారి ఆలోచనలు మాత్రం ఇతరులను మినహాయించే విధంగా ఉంటున్నాయి. వారు ఇతర మతాలకు చెందిన వారికి వ్యతిరేకంగా ఉంటున్నారు.ప్రముఖ చరిత్రకారుడు ఎరిక్ హాబ్స్‌బామ్ చెప్పినట్లు, ప్రతి జాతీయవాదం తన సొంత చరిత్రను నిర్మించు కుంటుంది. అలాగే ప్రతీ జాతీయవాదం తన భావజాలానికి అనుగుణంగా తన సొంత యోధులను సృష్టించుకుంటుంది. ఆ క్రమంలో ఆ యోధులు అనుసరించిన మార్గాన్ని వ్యతిరేకించిన వారిని కూడా అపకీర్తిపాలు చేస్తారు.ఇందుకుగాను పరిపూర్ణతతో కూడిన నైపుణ్యం కలిగిన రెండు వ్యూహాలు అవసరం. ఒకటి, తాము ప్రోత్సహించాలని భావించిన యోధులను సమర్థించడం. రెండు, ప్రత్యర్థి నాయకుల గురించి ప్రతికూలంగా విస్తృత ప్రచారం చేయడం. ఇదే ప్రస్తుతం భారతదేశంలో జరుగుతున్నది. ఒకవైపు మితవాద నాయకుడైన నాథూరామ్ గాడ్సే గురించి స్తుతిస్తూనే మరోవైపు మహాత్మా గాంధీ గురించిన ప్రతికూలమైన అంశాలను ప్రచారం చేస్తున్నారు.గాడ్సే కోసం దేవాలయాలు నిర్మించాలనే డిమాండ్లు నిరంతరం ఉంటూనే ఉన్నాయి. 'గాడ్సే గతంలో, ఇప్పుడు, భవిష్యత్తులో కూడా దేశభక్తుడే' అని మాలేగావ్ బాంబు దాడి నిందితురాలు, ప్రస్తుత పార్లమెంట్ సభ్యురాలు ప్రజ్ఞా ఠాకూర్ వాదిస్తూనే వున్నారు. గాడ్సే గురువు, సలహాదారు, హిందూత్వ స్థాపకుడైన వినాయక దామోదర్ సావర్కర్ చిత్రపటం ఇప్పటికే లోక్‌సభలో వేలాడుతోంది. ఇప్పుడు ఆయనకు భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న అవార్డు ఇవ్వాలని డిమాండ్ కూడా చేస్తున్నారు. గాడ్సే చేతిలో హత్యగావించబడిన గాంధీని ప్రతికూలమైన వ్యక్తిగా చూపించే ప్రయత్నంలో ఆయన హత్యకు సంబంధించిన వాస్తవాలను కూడా చెరిపివేస్తున్నారు. ఇప్పటికే ఆ వాస్తవాలు చాలా పాఠ్యపుస్తకాల్లో లేకుండా పోయాయి. ఇటీవలి కాలంలో గాంధీజీ ఆత్మహత్య చేసుకున్నాడనే తప్పుడు వార్తలను వ్యాప్తి చేసే ప్రయత్నాలు కూడా ఊపందుకున్నాయి. ఇటీవల గుజరాత్‌లో నిర్వహించిన తొమ్మిదవ తరగతి పరీక్షలో ఒక ప్రశ్న రూపంలో ఆ తప్పుడు వార్త ప్రతిబింబించింది. "గాంధీ ఆత్మహత్యకు ఎలా పాల్పడ్డాడు?" అన్నది ఆ ప్రశ్న. దేశ విభజనకు ఆయనే కారణమనీ, ఆయన



వల్లే పాకిస్తాన్‌కు రూ. 55 కోట్లు ఇవ్వాల్సి వచ్చిందనీ, ఆయన హిందూ వ్యతిరేకి అనీ, ముస్లింలను తృప్తిపరిచినందుకే ఆయన హత్య చేయబడ్డాడనే ప్రచారం ఇప్పటి దాకా సాగింది.ధ్యప్రదేశ్ లోని భోపాల్ నుండి పోటీ చేయడానికి టికెట్ ఇచ్చిన తన పార్టీ బిజెపిని కాపాడేందుకు గాడ్సేని దేశభక్తునిగా స్తుతించినప్పటికీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ ఆ తరువాత క్షమాపణలు చెప్పారు. అదే సమయంలో గాంధీజీని అపఖ్యాతి పాలు చేయడానికి, అంబేద్కర్ ఆయనపై చేసిన విమర్శలను సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. అంబేద్కర్ ఆయనపై చేసిన విమర్శలను కొన్నింటిని ప్రత్యేకంగా ఎంపిక చేసుకొని వాటిని వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారు.ఈ అసంబద్ధమైన మాటలు, అనేక ప్రయత్నాలు, గాడ్సేను కీర్తించడానికి, అతడు గాంధీని హత్య చేయడాన్ని సమర్థించేందుకు ఉద్దేశించినవిగా ఉన్నాయి. కానీ గాడ్సే ఎవరు? ఆయన తన రాజకీయ జీవిత గమనాన్ని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రచారక్‌గా ప్రారంభించి, ఆ తరువాత సావర్కర్ నాయకత్వంలోని హిందూ మహాసభలో చేరాడు. హిందూత్వ శక్తుల ప్రయత్నాలు గాంధీజీ అభిప్రాయాలను వివరించేందుకు కాకుండా, ఆయన చేసిన పనుల్లో దొర్లిన చిన్న చిన్న తప్పుల్ని వెతికేందుకు ఉద్దేశించబడుతున్నాయి. గాంధీని తప్పుడు వ్యక్తిగా చిత్రీకరించేందుకు, ఆయనకు ఇతర జాతీయ నాయకుల మధ్య ఉన్న భేదాభిప్రాయాలను గోరంతలను కొండంతలు చేసి చెప్పాలనుకుంటున్నారు. గాంధీ, అంబేద్కర్‌కు వ్యతిరేకం అని తెలిపే పూణే ఒప్పందం ఒక ప్రధానమైన అంశంగా మారింది. ఈ ఒప్పందంపై ఇద్దరు నాయకులూ సంతకాలు చేశారు. కానీ అణగారిన వర్గాల వారి రాజకీయ, సామాజిక భవిష్యత్తుకు సంబంధించిన నిబంధనలపై వారిరువురికీ ఏకాభిప్రాయం కుదరలేదు.అవును గాంధీ, అంబేద్కర్‌లు విభేదించుకున్నారు. కానీ వారి విభేదం వ్యూహాత్మక స్థాయిలో ఉంది. ఉదాహరణకు "ప్రత్యేక ఓటర్ల" విధానం భారతదేశంలో వలసవాద వ్యతిరేక పోరాట ఐక్యతను బలహీనపరుస్తుందని గాంధీజీ విశ్వసించాడు. అంటరానితనాన్ని అంతం చెయ్యాలని ఆయన నొక్కి వక్కాణించాడు. రాజ్యాంగంలో రిజర్వేషన్లను పొందుపరచడానికిగాను ఆయన నియోజక వర్గాల రిజర్వేషన్లపై పట్టు పట్టాడు. కానీ మతం, జాతి, వర్గంతో నిమిత్తం లేకుండా భారతీయులందరినీ తన వెంట తీసుకెళ్ళాల్సి వస్తుందని, వలసవాద వ్యతిరేక ఉద్యమ నాయకునిగా గాంధీజీ విశ్వసించాడు.స్వాతంత్ర్య లక్ష్యాన్ని సాధించే మార్గాల గురించి కూడా ఆయన చాలా స్పష్టంగా ఉన్నాడు. ఈ కారణంగానే భగత్ సింగ్, అతని అనుచరుల పట్ల గౌరవం ఉన్నప్పటికీ ఆయన క్షమాభిక్ష కోసం కేసుపై పట్టు పట్టలేదు. గొప్ప జాతీయవాది అయిన భగత్ సింగ్ కూడా నైతిక కారణలతో క్షమాభిక్ష కోరలేదు.భారత స్వాతంత్ర్యోద్యమం ప్రజాస్వామిక సూత్రాలపై ఆధారపడి ఉన్నది. వలసవాద వ్యతిరేక ఉద్యమాన్ని ఒక శక్తివంతమైన ప్రజా ఉద్యమంగా మార్చిన నేత గాంధీ. ఒకానొక మజిలీ తరువాత, గాంధీ వ్యూహానికి ఏ మాత్రం పొంతన లేని విధానాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. స్వాతంత్ర్యానికి చేరువలో వున్న వేళ కాంగ్రెస్‌లో నిర్ణయాలు చేసింది కూడా నెహ్రూ, సర్దార్ పటేల్, ఇంకా ఇతర ముఖ్య నాయకులే. అన్ని నిర్ణయాలు గాంధీ ఇష్టానికి అనుగుణంగా కూడా జరగలేదు. ఉదాహరణకు, గాంధీ దేశ విభజనను అంగీకరించలేదు. ఇతరులకు అనుకూలంగా ఉన్న ఆర్థిక విధానాలతో కూడా ఏకీభవించ లేదు. గాంధీకి ఉన్నతమైన నైతిక అధికారత ఉన్నప్పటికీ, తన శిష్యులైన నెహ్రూ, పటేల్‌లు ఆయన వ్యూహాలకు భిన్నమైన వాటిని స్వీకరించారు. "నా మాటకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో విలువ లేకుండా పోయింది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల పట్ల నేను సంతృప్తికరంగా లేను. వాటిని నేను బైటికి మాట్లాడలేకపోతున్నాను" అని గాంధీ ఒక సందర్భంలో అన్నారు.ఈ కోణంలో చూసినప్పుడు, అంబేద్కర్–గాంధీల మధ్య స్వల్పమైన భేదం ఉంది. గాంధీ స్వాతంత్ర్యోద్యమంలో చాలా పెద్ద నాయకుడే కానీ, నియంత కాదు. ఆ విధంగా, ఈ ఇద్దరు నాయకుల మధ్య విభేదాల కంటే ఏకీభావమే ఎక్కువ అనే వాస్తవాన్ని చరిత్ర ధ్రువీకరిస్తుంది. ప్రజాస్వామిక ప్రాథమిక మార్గదర్శక సూత్రాలు, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం లాంటి అనేక లోతైన విషయాలపై వీరిరువురూ ఒకే మార్గంలో ఉన్నారు.గాడ్సే చెప్పిందే సరైనదని నిరూపించడానికి, (మరణానంతరం, చాలా కాలం తర్వాత భిన్నాభిప్రాయాలలో కొన్నింటిని తీసుకొని వారి మధ్య ఉన్న) భేదాభిప్రాయాలను అతిశయోక్తిగా చెప్పేందుకు ప్రచారం చేస్తున్నారు. ప్రజాస్వామ్యానికి, ప్రజాస్వామిక ఉద్యమాలకు భిన్నాభిప్రాయాలే ప్రాణం. ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమిటంటే గాడ్సే, సావర్కర్‌లు జాతీయవాద భావనల విషయంలో అంబేద్కర్, గాంధీ, కాంగ్రెస్, ఇతర స్వాతంత్ర్యోద్యమ నాయకులకు భిన్నంగా ఉంటారు.గాంధీ, అంబేద్కర్, నెహ్రూ, పటేల్‌లు వైవిధ్యతను అంగీకరించే దేశం గురించి కలలుగంటుండగా, సావర్కర్ గాడ్సే, ఇతర హిందూ జాతీయవాదులు మాత్రం గతమంతా ఘనమైనదని, అన్నీ పురాణాలు–వేదాల్లోనే వున్నాయని అదేపనిగా మాట్లాడారు. వారి వారసులు ఇప్పటికీ మాట్లాడుతూనే వున్నారు. వాస్తవానికి వారు చెప్తున్న గతంలో అసమానతలనేవి పుట్టుక ఆధారంగా అంతర్నిర్మితంగా ఉన్నాయి. హిందూ మితవాద శక్తులు రోజురోజుకూ దృఢంగా, శక్తివంతంగా మారుతున్నాయి. వారి ఆలోచనలు మాత్రం ఇతరులను మినహాయించే విధంగా ఉంటున్నాయి. వారు ఇతర మతాలకు చెందిన వారికి వ్యతిరేకంగా ఉంటున్నారు. తమకు భిన్నంగా ఉన్నవారిపై తమ ఇష్టాయిష్టాలను రుద్దేందుకు పరాయివారనే ముద్ర వేస్తారు.ఏహిందూ జాతీయవాదులు ఏ భావజాలం కోసమైతే ఉన్నారో, ఆ భావజాలం కోసమే ప్రజ్ఞా ఠాకూర్ నిలబడుతున్నారు. అయితే దీనిని వారు స్పష్టం చేయదలచుకోవడం లేదు. తమ కార్యక్రమాలన్నింట్లోనూ గాడ్సే ప్రాతినిధ్యం వహించే భావజాలానికి అనుకూలంగా మాట్లాడుతూ, కీర్తించేందుకు ప్రయత్నిస్తుంటారు.

# రైతు పక్షం వహించాలి

ఏకకాలంలో కరువు కాటు తుపాను పోటులకు రైతాంగం అతలాకుతలమై దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. అసలే వ్యవసాయం సంక్షోభం అంచుకు చేరగా, సాగుదారులపై ఒకదాని వెంట మరొక విపత్తు కత్తి దూయడం శరాఘాతం. డిసెంబర్‌లో వచ్చిన మిచౌంగ్ తీవ్ర తుపాన్ కోస్తాలోని అన్ని జిల్లాలపై ప్రతాపం చూపింది. లక్షల ఎకరాల్లో చేతికొచ్చిన ఖరీఫ్ పంటలను ఊడ్చేసింది. ప్రధానంగా కోతకొచ్చిన వరి పైరు వరదలో పూర్తిగా మునిగిపోయింది. కల్లాల్లో కోసిన పంట, ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. పత్తి, మొక్కజొన్న, మిర్చి, ఇత్యాది పంటలు వర్షార్పణమయ్యాయి. రబీలో సాగు చేసిన శనగ, మినుము, పొగాకు తదితర పంటలూ మట్టిపాలయ్యాయి. ఈదురుగాలులకు కోస్తా, రాయలసీమల్లో తోటలు నేలమట్టమయ్యాయి. తుపాన్ వెలిసి రోజులు గడుస్తున్నా ఎన్యూమరేషన్ లేదు. ముఖ్యమంత్రి వద్ద సమీక్షలో నష్టం నాలుగు లక్షల ఎకరాల్లోనేనన్నారు. కాగా క్షేత్ర స్థాయిలో తుపాన్ విధ్వంసం మాటలకందకుండా ఉంది. నష్టం అంతకు నాలుగు రెట్లు పైమాటేనంటున్నారు. నష్టపోయిన రైతులను తప్పకుండా



ఆదుకుంటామని, అన్యాయం చేయబోమని తుపాన్ ప్రాంతాల్లో పర్యటన సందర్భంగా సిఎం జగన్ హామీ ఇచ్చారు.భౌగోళిక, వాతావరణ పరిస్థితుల రీత్యా ఆంధ్రప్రదేశ్‌కు నవంబర్, డిసెంబర్ నెలల్లో తుపానులు సాధారణం. అందుకనుగుణంగా నష్ట నివారణకు ముందస్తు చర్యలు చేపట్టం ప్రభుత్వ బాధ్యత. తుపాన్లొచ్చే సమయానికి ఖరీఫ్ కోతలు పూర్తయ్యే విధంగా కాల్వలకు నీరు విడుదల చేస్తున్నామని సర్కారు చెపుతున్నా వర్షాభావం, ప్రాజెక్టుల్లో నీటి కొరత, కాల్వలకు మరమ్మతులు లేక చివరి భూములకు నీరు చేరని దుస్థితి, మెట్ట ప్రాంతాల్లో కరువు, కరెంట్ కోతలు వెరసి ఎప్పటికంటే కూడా ఈ మారు ఖరీఫ్ సాగు ఆలస్యమైంది. అన్ని అడ్డంకులనూ దాటుకొని పంట పండిస్తే సరిగ్గా కోతల వేళకు తుపానొచ్చి నీటిపాల్జేసి అన్నదాతల వెన్ను విరిచింది. పెట్టుబడులు సైతం దక్కని దైన్యం. నోటికాడికొచ్చిన పంట కళ్ల ముందే ఆగమాగమవుతుంటే రైతుల గుండెలు తరుక్కుపోతున్నాయి. మనస్తాపంతో రైతుల, కౌలు రైతుల ఆత్మహత్యలు చోటు చేసుకోవడం విషాదం.రైతు పక్షపాతులమని ఊరూ వాడా టముకేసుకుంటున్న ప్రభుత్వం విపత్తు రైతులను ఆదుకునే విషయంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందనడానికి సర్కారు చేతలే నిదర్శనం. తుపానొచ్చి చేలు కొట్టుకుపోయి విలవిలాడుతున్న రైతులను ముఖ్యమంత్రి పరామర్శించిన తీరే సాక్ష్యం. కనీసం పొలం వద్దకెళ్లలేదు. ఆపన్నులకు ప్రభుత్వం ఇచ్చే విలువేంటో, బాధితులకు చేసే సహాయంపై సర్కారు చిత్తశుద్ధి ఏంటో ఈ ఘటనలతో తెలిసిపోతుంది. కరువుపైనా ఇదే బడి. ఖరీఫ్‌లో 400కు పైన మండలాల్లో దుర్భిక్షం ఉందని రైతులు భోరుమంటున్నా కరువు కాస్తేనని 103 మండలాలకు పరిమితం చేసింది. ఖరీఫ్ ముగిసిన రెండు మాసాలకు కేంద్ర బృందాలంటున్నారు. ఎప్పటికి పరిహారం, బీమా ఇస్తారో తెలీదు. ఇప్పుడొచ్చిన తుపాన్ సాయం ఎప్పటికో? వాస్తవ నష్టాలకు, ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీకి పొంతనే లేదు. ఉదాహరణకు ఎకరా వరికి రైతుకు పెట్టుబడి రూ. 20 వేలైతే ప్రభుత్వం ఇచ్చేది రూ. 6,800 మాత్రమే. దానికే రైతులను ఆదుకుంటున్నామంటున్నారు. రంగు మారిన, తడిసిన ధాన్యం, ఇతర పంటల కొనుగోళ్ల హామీలూ నీటిపై రాతలేనని గత అనుభవాలు చెప్పుతున్నాయి. రూ. 2 వేల కోట్ల విపత్తు నిధి ఏమైందో తెలీదు. కరువు, తుపాన్ సహాయంపై కేంద్రాన్ని రాష్ట్రం అడిగింది లేదు.

# కొంప ముంచిన ఓవర్ కాన్ఫిడెన్స్...

హైదరాబాద్, డిసెంబర్ 12, :సాంప్రదాయాక రాజకీయాలకు చాలా కాలం క్రితమే కాలం చెల్లిపోయింది. పాలిటిక్స్ మొత్తం కన్సల్టెంట్ల చెప్పు చేతల్లో నడుస్తున్నాయి.గత దశాబ్ద కాలంలో పొలిటికల్ కన్సల్టెంట్ల ప్రభావం గణనీయంగా పెరిగింది. తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ వైఫల్యానికి ఎవరి సలహాలు తీసుకోకపోవడం కూడా ఓ కారణమని ప్రచారం జరుగుతోంది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పొలిటికల్ కన్సల్టెంట్ల సేవల్ని వినియోగించుకునే విషయంలో బిఆర్ఎస్ పార్టీ చేసిన చిన్న పొరపాటుకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని చెబుతున్నారు. దాదాపు ఏడాదిన్నర, రెండేళ్ల క్రితమే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం గ్రౌండ్ ప్రిపేర్ చేసే క్రమంలో ప్రశాంత్ కిషోర్ బృందంతో బిఆర్ఎస్ అగ్ర నాయకత్వం చర్చలు జరిపింది. కొన్ని నెలల పాటు ఆ సంస్థ తెలంగాణలో అధికార పార్టీకి సేవలు కూడా అందించింది. ఏం జరిగిందో నిర్దిష్టంగా తెలియకపోయినా మూడు నాలుగు నెలలకే బిఆర్ఎస్‌తో బంధానికి బ్రేక్ పడింది.ఆ తర్వాత కన్సల్టెంట్లు చెప్పే సలహాలను అమలు చేసే విషయంలో బిఆర్ఎస్ నాయకులు బహిరంగంగా ఎద్దేవా కూడా చేశారు. పొలిటికల్ కన్సల్టెంట్స్ ఆచరణ సాధ్యం కాని సలహాలు ఇస్తుంటారని, వాటిని పాటించలేమంటూ బిఆర్ఎస్ నాయకులు పబ్లిక్‌గా జోకులు సైతం వేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ప్రశాంత్ కిషోర్ బృందం కేసీఆర్ ప్రభుత్వానికి ఏమి సలహా ఇచ్చిందనే విషయంలో ప్రచారం జరుగుతోంది.తెలంగాణలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా అమలు చేసిన ప్రతిష్టాత్మక పథకాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల స్కీం ఉంది. ఈ పథకం అమలుపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో దానిని మార్చాలని పికె టీమ్ సిఫార్సు చేసినట్లు చెబుతున్నారు.డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల బదులు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే వ్యయాన్ని నేరుగా లబ్దిదారుడికి అందించేలా మార్చాలని సూచించినట్టు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంటుతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సాయాన్ని కలిపి నేరుగా కలిపి లబ్దిదారుడికి ఇస్తే ఎక్కువ ప్రయోజనంతో పాటు సానుకూల ఫలితాలు ఉంటాయని సూచించినట్టు తెలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో పలు సంస్కరణలను ఐ పాక్ ప్రతిపాదించడం వాటికి కేసీఆర్ సర్కారు నిరాకరించినట్టు చెబుతున్నారు. దీంతో పాటు తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం, సిట్టింగ్ ఎమ్మెల్యేలో 45–50మందిని మార్చడం వంటి సిఫార్సులు చేసినట్టు తెలుస్తోంది.ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో విధాన పరమైన నిర్ణయాల్లో మార్పులు చేయడానికి కేసీఆర్ నిరాకరించడంతో కన్సల్టెన్సీ బాధ్యతల నుంచి ఐపాక్ తప్పుకున్నట్టు చెబుతున్నారు. ఆ తర్వాత మరో సంస్థను డిజిటల్ కాంపెయినింగ్ కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం నియమించుకున్నా ఆశించిన ఫలితాలు రాలేదని చెబుతున్నారు.అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ తరపున సునీల్ కనుగోలు పనిచేశారు. మిగిలిన రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి ఆశించిన ఫలితాలు రాకపోయినా తెలంగాణలో మాత్రం ప్రభుత్వ వ్యతిరేకతను పెంచడంలో కన్సల్టెంట్లు కీలక పాత్ర పోషించారు. ఓ దశలో కాంగ్రెస్ పార్టీ వార్‌రూమ్‌పై పోలీసులు దాడి చేయడంతో దానిని బెంగుళూరుకు మార్చి కార్యకలాపాలు నడిపించారు.

# జిల్లాల పర్యటనకు రేవంత్..!



అదిలాబాద్, డిసెంబర్ 12, :తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో జిల్లా పర్యటనలు ప్రారంభించ బోతున్నారా..? ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం అవుననే తెలుస్తోంది. ముఖ్యంగా ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లోగా అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడం అలాగే 2024 ఏప్రిల్లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకొని పార్టీని మరింత పటిష్టం చేయడం ఈ పర్యటనల ప్రధాన ఉద్ధేశంగా తెలుస్తోంది. శాసనసభలో స్పీకర్ ఎన్నిక ఈ నెల 14న జరిగిన తర్వాత ఓ వారం పాటు అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఆ సమావేశాల తర్వాతే జిల్లా పర్యటనలు ఉండే అవకాశం ఉంది. అంతే కాదు ఆ పర్యటనలకు ముందే రాష్ట్ర వ్యాప్తంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు కూడా భారీ స్థాయిలో ఉండే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాల సమచారం. మొత్తంగా వీటన్నింటినీ ఈ నెలాఖరులోగా పూర్తి చేసి కొత్త ఏడాదిలో అంటే 2024 జనవరిలో సీఎం జిల్లాకు వెళ్లే అవకాశం ఉందని సమాచారం.డిసెంబర్ 27న జరగనున్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఉద్యోగుల సంఘం ఎన్నికలపై కూడా రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. సింగరేణి ప్రాంతం పెద్దపల్లి, ఖమ్మం, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాలను కవర్ చేస్తుంది. 2017 అక్టోబర్‌లో జరిగిన ఎన్నికల్లో ఃఖీూ అనుబంధ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గెలుపొందగా, కోల్ బెల్ట్ ప్రాంతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసిన కాంగ్రెస్ ఇప్పుడు యూనియన్ ఎన్నికలను కైవసం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఎన్నికల్లో 39,748 మంది కార్మికులు (ఓటర్లు) తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.అలాగే సింగరేణి పరిధిలో ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లోని 11 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. తాజా ఎన్నికల్లో తొమ్మిదింటిని కాంగ్రెస్ గెలుచుకుంది. కొత్తగూడెం కాంగ్రెస్ మిత్రపక్షమైన సీపీఐకి వెళ్లగా, బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి ఆసిఫాబాద్ స్థానంలో గెలుపొందారు. 2018లో కాంగ్రెస్ ఆరు గెలిచింది.

# మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలి

**సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్**



ఆసిఫాబాద్ జిల్లా డిసెంబర్ 12 (ప్రజాపాలన,ప్రతినిధి) : పెండింగ్ లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం డిఇఓ కార్యాలయంలో ఏడి గమనియాల్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు నెలల తరబడి పెండింగ్లో ఉండడం తో తీవ్రమైన ఇబ్బందులు గురవుతున్నారని, అప్పులు తెచ్చి స్కూల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారని అన్నారు. తెచ్చిన అప్పులకు రోజురోజుకు వడ్డీ పెరుగుతుందని, ఈ మధ్యకాలంలో ఉదయం పూట టిఫిన్ పెట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసిందని, దీనికి ఏమాత్రం గైడెన్స్ ఇవ్వకుండా వంట పాత్రలు కూడా సరఫరా చేయకుండా, టిఫిన్ పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. దీని మూలంగా అదనంగా అప్పుల పాలు కావలసిన పరిస్థితి ఉందన్నారు. కావున రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే పెండింగ్ లో ఉన్న బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా కార్యదర్శి మాయ, విజయ,తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



మేడిపల్లి, డిసెంబర్ 12 (ప్రజాపాలన ప్రతినిధి) : ఉప్పల్ గాంధీ నగర్లో అమావాస్య వంశీ గురుస్వామి నిర్వహించిన అయ్యప్ప స్వామి 18వ మహా పడిపూజ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని అయ్యప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు ఆకుల మహేందర్, అన్న బాలకృష్ణ, పంగ రాజేశ్వర్ రెడ్డి, రాజు లింగాయత్, రావుల నవీన్ గౌడ్, రోశయ్య డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఏజెన్సీకి 'దారి' చూపేనా?

## అటవీ అనుమతుల చిక్కులతోనే అవరోధం అంటున్న అధికారులు

### జిల్లాలో 339ఆవాసాలకు మట్టి రోడ్లు కూడా కరువే



ఆసిఫాబాద్ :కనీసం మౌలిక సదుపాయాలు లేక కాలినడకన కూడా వెళ్లే దారి లేక ఏజెన్సీ వాసులు సమస్యల నడమ సహవాసం చేస్తున్నారు. ప్రతిఏటా వర్షాకాలానికి ముందు రోడ్ల నిర్మాణ ప్రతిపాదనల పేరుతో అధికారులు హడావుడి చేయటం ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు పేరుతో రాళ్లు పాతటం జిల్లాలో పరిపాటిగా మారింది. ఫలితంగా రహదారుల పురోగతి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్టుగా తయారైంది. ఆసిఫాబాద్ జిల్లా ఏజెన్సీలో 75 ఏళ్లుగా గిరిజన ఆవాసాల్లో విద్యా, వైద్యం మాట దేవుడెరుగు.. కనీసం రోడ్డు సౌకర్యం లేక పోవటంతో రోగం వచ్చినా, నొప్పి వచ్చినా దేవుడిపై భారం వేసి నాటు వైద్యంతోనే కాలం వెల్లదీస్తూ వస్తున్నారు. జిల్లాలో అటవీ ప్రాంత రహదారుల నిర్మాణం కోసం సుమారు 500కోట్ల రూపాయలకుపై నిధులు అవసరం అవుతాయని జిల్లా పంచాయతీరాజ్, రహదారులు భవనాలశాఖ అధికారులు గత పదేళ్లుగా ప్రతిపాదనాలు చేసి ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. అయితే ఆ ప్రతిపాదనల్లో కనీసం పది శాతం కూడా కార్యరూపం దాల్చటం లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల ఏర్పడిన కొత్త ప్రభుత్వంపై ఆదివాసీ గ్రామాల ప్రజలు కోటి ఆశలు పెట్టుకుంటున్నారు. దానికి తోడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణం స్వీకారం చేసిన రోజే ఆసిఫాబాద్ జిల్లా ఏజేన్సీ స్థితిగతులపై సమీక్ష చేయటంతోపాటు నివేదికలు కోరటంతో ఇకనైనా తమ కష్టాలకు ఫుల్‌స్టాప్ పడుతుందన్న ఆశలు ఆదివాసుల్లో వ్యక్తమవుతోంది. ఆసిఫాబాద్ జిల్లాలోని 335 గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 1050కిపైగా ఆవాసాలు ఉండగా, అందులో ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని కెరమెరి, వాంకిడి, జైనూరు, సిర్పూరు(యు), లింగాపూర్, తిర్యాణి మండలాల పరిధిలో దాదాపు 280 గ్రామాలకుపై మట్టి రోడ్లు కూడా లేవని తేల్చారు. అలాగే కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని పెంచికల్‌పేట, దహెగాం, బెజ్జూరు, చింతలమానేపల్లి మండలాల పరిధిలో మరో వంద గ్రామాలకుపైగా రోడ్డు సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**వర్షాకాలం నడకే నరకం..**

ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని ఏజెన్సీ గ్రామాల్లో ప్రతి ఏటా వర్షాకాలంలో మారుమూల పంచాయతీలు గిరిజనగూడాలకు రోడ్డు సదుపాయం లేక అటవీ గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా మారుమూలన వాగులు, వంకలు ఉండే గ్రామాల్లో వర్షాకాలం ప్రజలు బయటికి రాలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. అయితే జిల్లాలోని అటవీగ్రామాల్లో రోడ్డు సదుపాయం కల్పించటం కోసం అధికారులు ప్రయత్నిస్తున్నా అటవీశాఖ అనుమతుల పేరుతో అడ్డుకుంటోందన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఫలితంగా ఆయా గ్రామాలకు రోడ్డు నెట్‌వర్క్ అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. సిర్పూరు, ఆసిఫాబాద్ నియోజకవర్గాల పరిధిలో మరి ముఖ్యంగా 126గ్రామాలకు రోడ్డు సమస్య తీవ్రంగా ఉంది. ఆయా గ్రామాల్లో వర్షాకాలం వచ్చిదంటే బాహ్యప్రపంచాన్ని చూడలేని పరిస్థితులు ఎదురవుతున్నాయంటున్నారు స్థానికులు. జిల్లాలో 300కిలో మీటర్ల మేర మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలన్న ప్రతిపాదనలు కూడా అటవీశాఖ అడ్డగోలు నిబంధనల వల్ల నిలిచిపోయాయాని అధికారులు చెబుతున్నారు.


























# పోలీసు శాఖలో కీలక బదిలీలు..

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటి వరకూ సైబరాబాద్ సిపిగా ఉన్న స్టీఫెన్ రవీంద్ర , రాచకొండ సిపిగా ఉన్న దేవేంద్ర సింగ్ చౌహాన్‌లను డిజిపి ఆఫీస్‌కు ఎటాచ్ చేశారు. నిజానికి హైదరాబాద్ సిపిగా ఉన్న సివి ఆనంద్‌ను ఎన్నికల కోడ్ ప్రారంభమయ్యాక ఇసి బదిలీ చేసింది. ఆయన స్థానంలో సందీప్ శాండిల్యను నియమించారు. ఇప్పుడు ఆయనకు నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్‌గా బదిలీ ఆదేశాలు అందాయి.సిఎం రేవంత్‌రెడ్డి డ్రగ్స్ విషయంలో పూర్తిస్థాయిలో కట్టడి చర్యలు తీసుకోవాలనుకుంటున్నందున సందీప్ శాండిల్యకు కీలకమైన బాధ్యతలే వచ్చాయని భావిస్తు న్నారు. ఏదైనా కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికార యంత్రాంగాన్ని ప్రక్షాళన చేసుకుంటారు. గత ప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యత ఉన్న పోస్టుల్లో ఉన్న వారిని లూప్‌లైన్‌కు పంపి అప్పటి వరకూ లూప్‌లైన్‌లో ఉన్న వారికి ప్రాధాన్యత పోస్టులు ఇస్తుంటారు. ఎందుకంటే గత ప్రభుత్వంలో కీలక స్థానాల్లో ఉన్నా అప్పటివరకూ ప్రభుత్వంలో ఉన్న వారికి సన్నిహితులని భావిస్తారు. అంతేకాదు ఎన్నికల సమయంలోనూ వారే విధులు నిర్వహించి ఉంటారు. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని గతంలో కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ముఖ్యంగా సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రపై కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో ఆయనను సైబరాబాద్ కమిషనర్ నుంచి తప్పించి డిజిపి ఆఫీసుకు ఎటాచ్ చేశారు. ఆయనకు ఏదైనా ప్రాధాన్యమైన పోస్టింగ్ లభిస్తుందా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. ఐఏఎస్ అధికారులను కూడా భారీగా బదిలీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా బదిలీలతో పోలీసు ఉన్నతాధికారుల్లో సిఎం రేవంత్ వైఖరి ఏంటో అర్థం అయింది. రెండు రోజుల్లో ఐజి నుంచి ఎస్పీల వరకు బదిలీలు జరుగుతాయని తెలిసింది. గత ప్రభుత్వంలో కీలక పదవుల్లో కొనసాగిన అధికారులకు కొందరికి ఇబ్బందులు ఉండకపోవచ్చని అంటున్నారు. డిజిపి రవిగుప్తాను కూడా త్వరలో మార్చనున్నారని విశ్వసనీయ సమాచారం. మరో ఐదు నెలలో సర్వీస్ ఉండటం లోక్‌సభ ఎన్నికల సమయంలో కొత్తవారు వస్తే ఇబ్బందికరమని, ఇప్పుడే పూర్తిస్థాయి డిజిపిని నియమించాలని సిఎం కెసిఆర్ యోచిస్తున్నారని తెలిసింది. ఈ పదవుల పందెరం చూస్తే తెలంగాణ వచ్చిన కొత్తలో సిఎం కెసిఆర్ కూడా ఈ మాదిరే సమర్థులైన అధికా రులతో టీం తయారు చేసినా రెండో దఫా ప్రభుత్వం అధికారంలోకి రాగానే నలుగురితో నారాయణ అన్నట్లు కెసిఆర్ ప్రభుత్వం వ్యవహ రించిందనే ఆరోపణలున్నాయి. కెసిఆర్ ప్రభుత్వంలో పోలీసు శాఖలో కొంతమందికే అందలాలు దక్కాయని అపవాదుంది. కావాల్సిన అధికా రులకు అదనపు బాధ్యతలతో అప్పగిస్తే మరికొందరిని నెలల తరబడి వెయిటింగ్‌లో ఉంచారు. పదోన్నతులు ఇచ్చినా పాత బాధ్యతల్లోనే కొనసా గించటం జరిగింది. ముఖ్యంగా ఎస్‌ఐ, సిఐల బదిలీల్లో ఎంఎల్‌ఎల సిఫారసులు తప్పనిసరి చేయటంతో బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో పోలీసు అధికా రులు సమర్థవంతంగా విధులు నిర్వహించలేకపోయారనేది వాస్తవం. దీంతో చట్టం కొందరికి చుట్టంలా మారిపోయిందన్న విమర్శలు వినవచ్చా యి. కాగా, తొలి నుంచే దూకుడు వైఖరిని అవలంబిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి పోలీసు శాఖలో పూర్తిస్థాయి సంస్కరణలు తీసుకొచ్చి గత ప్రభుత్వా నికి భిన్నంగా వ్యవహరించే అవకాశం మెండుగా ఉందని పోలీసు వర్గాల ఉవాచ.




## బీసీ జనగణన చేయాలని కోటి సంతకాల సేకరణ




మంచిర్యాల టౌన్, డిసెంబర్ 12, ప్రజాపాలన : కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీ జనగణన చేయాలని కోటి సంతకాల సేకరణమంగళవారం పట్టణంలో బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1931 సంవత్సరం లో బ్రిటిష్ ప్రభుత్వం చేపట్టిన బి సి జనగణన తప్ప ఇప్పటివరకు ఏ ప్రభుత్వం బిసి జనగణన చేపట్టిన పాపాన పోలేదు జనగణన పట్టిక లో 34 కాలమ్స్ ఉన్నాయి కుల గణన చేస్తే అదనంగా ఇంకొక కాలం మాత్రమే చేరుతుంది దీనికి రూపాయ కూడా ఖర్చు కాదు పట్టిక లో ఒక కాలం అదనంగా చేర్చడానికి అంగీకరించని కేంద్ర ప్రభుత్వం దేశంలోనే 85 కోట్ల మంది బీసీలను ఎలా అభివృద్ధి చేస్తుందని ప్రశ్నించారు. స్వతంత్రం వచ్చి 76 ఏళ్లు దాటినా 60 శాతం జనాభా కలిగిన బీసీలకు రిజర్వేషన్ల కేటాయింపులో అన్యాయం స్పష్టంగా కనిపిస్తుందని దేశంలో గుర్తింపు పొందిన 27 రాజకీయ పార్టీలు బిసి జనగణనకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వానికి లేఖలు ఇవ్వడం జరిగింది 9 రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ గణనకు అనుకూలంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించిన బీసీ గణన చేపట్టడంలో నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా బీసీల న్యాయమైన డిమాండ్ పరిష్కరించి బీసీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిజెపి ప్రభుత్వం బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్ రాష్ట్ర నాయకులు గజెల్లి వెంకన్న పట్టణ అధ్యక్షులు బోడంకి మహేష్ జైపాల్ సింగ్ అంకం సతీష్ అరెందుల్ల రాజేశం ఇన్నారం కిరణ్ బోర శేఖర్ బొప్ప అంజన్న రాసమల్ల కుమార్ కీర్తి బిక్షపతి నగునూరి లక్ష్మణ్ ఆడెపు రాజేష్ వేముల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ వీరబాబుఆధ్వర్యంలో ఆశా డే కార్యక్రమం




మధిర రూరల్ డిసెంబర్ 12 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలో మాటూరు పేట, పిహెచ్సి, ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది సమావేశంలో వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి గృహాన్ని సందర్శించి డ్రై డే ఫ్రైడే మీద కుటుంబాలకు అవగాహన కల్పించి, నిలువ నీరు లేకుండా చూసుకోవాలని, తద్వారా దోమల నిర్మూలన జరుగుతుందని అప్పుడు డెంగ్యూ, వైరల్ ఫీవర్స్ రాకుండా కాపాడుకోవచ్చని ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే గుర్తించి మొదట పారాసెటమాల్ మాత్రలతో తగ్గకపోతే మాటూరు పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకి పంపవలెను గ్రామాల్లో 30 సంవత్సరాల దాటిన వారందరిని గుర్తించి, బిపి షుగర్ పరీక్షలు నెలనెలా చేయవలెనని, వైద్యాధికారి గుర్తించిన షుగర్, బిపి వారికి నెలకు సరిపోను మందులను,జాగ్రత్తలను జీవనశైలిని ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించాలని, అలానే నిమ్ము తో బాధపడుతున్న వారిని టెస్ట్ కోసం, స్కూలు పిల్లలను సందర్శించి జలుబు, దగ్గు, గొంతు నొప్పి,గవద బిళ్ళలు, జ్వరాలపై పిల్లల కు అవగాహన కల్పించాలని, గర్భిణీ స్త్రీలు గృహసందర్శనం చేయవలెనని, సురక్షిత కాన్పు ప్రభుత్వ హాస్పిటల్లో అయ్యేటట్ల ఆరోగ్య అవగాహన కల్పించాలని వైద్యాధికారి ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## చెన్నూరులో పాస్టర్లకు నూతన వస్త్రాలు పంపిణీ..




తల్లాడ(కల్లూరు), డిసెంబర్ 12 (ప్రజాపాలన న్యూస్): కల్లూరు మండలంలోని చెన్నూరు గ్రామంలో పాస్టర్లకు మంగళవారం నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. గ్లోబల్ గాస్పెల్ మిషన్ ఆధ్వర్యంలో సుమారు 30 మంది దైవజనులకు వస్త్రాలను అందించారు. చెన్నూరు గ్రామ దైవజనులు బ్రదర్ మురళి మోజేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్, టీసీఎం వారి సహకారంతో మాణిక్యరావు చేతులమీదుగా వీటిని అందించారు. అనంతరం మాణిక్యరావు, మురళి మోజేష్ మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పాస్టర్లకు నూతన వస్త్రాలు పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా గుంటూరు నుంచి వచ్చిన డాక్టర్స్ కి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దైవజనులు పాల్గొన్నారు.

## తులేకలన్ గ్రామాన్ని అధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానని తెలిపిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహింపట్నం డిసెంబర్ తేదీ 12 ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే గాఎన్నికైన మాల్ రెడ్డి రంగారెడ్డి గారిని కలసి శుభాకాంక్షలు తెలియజేసిన ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్ మరియు తలేకలన్(పెత్తుల్ల) కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మాల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ మీ గ్రామం పెత్తుల్ల కి అభివృద్ధికి అధిక నిధులు ఇస్త అని ఈసందర్భంగా తెలియ జేయడం జర్గింది ఈ కార్యక్రమాంలో కోడూరి పండు, సత్తు శేషాంక్ రెడ్డి, దోమ సుదర్శన్, సత్తు నారన్ రెడ్డి, సమ గోపాల్ రెడ్డి, వై శశివర్ణం, పంబలి జంగయ్య, ఎడ్ల విష్ణు, వర్ధన్ రెడ్డి, సమ గోపాల్ రెడ్డి, కన్నారెడ్డి, బండి వెంకటేష్, బోడ మహేందర్, బోడ మైసయ్య దయల మైసయ్య, పంబలి పండు, పంబలి ప్రభు, అచ్చన శివ, కోడూరి మహేష్, బత్తుల శ్రీను, బండ కిరణ్, దొడ్డి బీమా, బండి శ్రీశాంత్, బోడ లింగం, కె జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సీఎంవో మార్పు..?



హైదరాబాద్, డిసెంబర్ 12, :తెలంగాణ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయాన్ని ప్రగతిభవన్ (ప్రజాభవన్)లో కాకుండా మరో చోటికి మార్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ను ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ ప్రాంగణలోకి సీఎం క్యాంపు కార్యాలయం మార్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ ప్రాంగణాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీని సీఎం క్యాంప్ ఆఫీసుగా మార్చేందుకు గల సాధ్యాసాధ్యాలపై రిపోర్ట్ ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినట్టు సమాచారం. ప్రస్తుతం ప్రగతి భవన్... ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంగా ఉంది. తెలంగాణ సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రగతిభవన్‌లో కొన్ని మార్పులు చేర్పులు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో.... ప్రగతిభవన్‌ను డాక్టర్ జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌గా మార్చారు. రోజూ ప్రగతిభవన్‌లో ప్రజాదర్బార్ కూడా నిర్వహిస్తున్నారు. ప్రజాదర్బార్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు కూడా ఉదయం 10 గంటల నుంచి గంట పాటు ప్రజలకు అందుబాటులో ఉండి వారి నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్నారు. దీంతో... సీఎం క్యాంప్ కార్యాలయాన్ని మరోచోటికి మార్చాలని ప్రయత్నిస్తున్నారు రేవంత్‌రెడ్డి. ప్రస్తుతం జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి సమీపంలో రేవంత్‌రెడ్డి నివాసం ఉంది. ఇప్పుడు అక్కడి నుంచే సచివాలయం, ప్రజాభవన్కు వెళ్తున్నారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ఉంటున్న ఇంటికి, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం కి దూరం చాలా తక్కువ. దీంతో అక్కడే క్యాంపు ఆఫీసు ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. సిటీలో అందుబాటులో ఉండేలా.. సామాన్యులకు ఇబ్బంది లేకుండా.. ఈ ఏరియా అయితే సరిపోతుందని భావిస్తున్నారట. దీంతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ కార్యాలయానికి భద్రతతో పాటు ఇతర అంశాలను కూడ అధికారులు పరిశీలించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, అధికారులు కలిసి ఎంసీహెచ్‌ఆర్‌డీ భవనాన్ని పరిశీలించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ ఫ్యాకల్టీతో ఇంటరాక్ట్ అయ్యారు ముఖ్యమంత్రి. ఆ సంస్థ కార్యకలాపాల గురించి ఆరా తీశారు. ఉద్యోగులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత సంస్థలోని వివిధ బ్లాకులను పరిశీలించారు. ముఖ్యమంత్రికి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా... అన్ని విషయాలు వివరించారు ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ డీజీ డాక్టర్ శశాంక్ గోయల్.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ) ప్రాంగణం దాదాపు 45 ఎకరాల విస్తీర్ణంతో ఉంది. అక్కడ 150 మంది కూర్చునే నాలుగు కాన్ఫరెన్స్ హాళ్లు, పరిపాలక మండలి సమావేశం కావడానికి వీలుగా బోర్డ్ రూమ్, 250 మంది వరకు కూర్చునేలా ఆడిటోరియం, అతిథులకు ఆతిథ్యం ఇవ్వడానికి మంజీర, కృష్ణ, గోదావరి, తుంగభద్ర పేర్లతో విడివిడి బ్లాకులు ఉన్నాయి. పైగా ఎంసీహెచ్‌ఆర్‌డీ భవనాన్ని క్యాంప్ కార్యాలయంగా ఉపయోగించుకుంటే ట్రాఫిక్ సమస్య ఉండదని సీఎం భావిస్తున్నారట. ఒకవేళ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీని సీఎం క్యాంపు కార్యాలయంగా వినియోగిస్తే.... అక్కడ నిర్వహిస్తున్న శిక్షణ సంస్థను ప్రజాభవన్‌కు తరలించే అవకాశాలు ఉన్నట్లు తెలిస్తోంది. ప్రభుత్వం దీనిపై త్వరలో ఓ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

## జిలుగుమాడు గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంప్



మధిర డిసెంబర్ 12 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో జిలుగుమాడు గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించిన దోర్నాల ప్రశాంత్ పుట్టినరోజు అందరికీ అదొక పండుగ రోజు జీవితంలో మర్చిపోయేలా ఏదో ఒకటి చేయాలి అని అనుకునే ఆ రోజు కొంతమంది స్నేహితులతో బంధువులతో పంచుకుంటారు కానీ జిలుగుమాడు గ్రామానికి చెందిన దోర్నాల ప్రశాంత్ అనే యువకుడు తన పుట్టినరోజు సందర్భంగా పేదలకు అతిథినావస్థలో బాధపడుతున్న వారికి.. అతనికి తోచినంత సహాయంగా సాధారణ ఉచిత వైద్య చికిత్సలు అందించడానికి ముందుకు వచ్చారు.. స్వతహాగా సాఫ్ట్వేర్ ఇంజనీర్ అయిన దోర్నాల ప్రశాంత్ సెలవుల సమయంలో సొంత గ్రామమైన మధిర మండలం జిలుగుమాడు గ్రామానికి వచ్చి సామాజిక సేవా కార్యక్రమాలను ఎల్లప్పుడూ నిర్వహిస్తూ ఉండేవాడు. అనేక అనాధ ఆశ్రమాలకు అలాగే పేదలకు నూతన వస్త్రాల పంపిణీ రక్తదానం తదితర సామాజిక సేవ అంశాలపై ఎక్కువ దృష్టి సారించేవారు.. అదేవిధంగా ఈరోజు తన పుట్టినరోజు సందర్భంగా జిలుగుమాడు గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించడమే కాకుండా 100 మందికి పైగా ఉచిత వైద్యం మరియు కళ్ళజోళ్ళ పంపిణీ తదితర ఆరోగ్య సమస్యల పై డాక్టర్ల సూచనల మేరకు వారికి తగిన మందులు అందించారు. ఈ సందర్భంగా జిలుగుమాడు గ్రామస్తులు పుట్టినరోజు సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించిన దోర్నాల ప్రశాంత్ ఈ కార్యక్రమంలో దోర్నాల రామకృష్ణ దంపతులు ప్రజలు పాల్గొన్నారు

# న్యూ ఇయర్ కు భారీగా డ్రగ్స్..!

హైదరాబాద్, డిసెంబర్ 12, :న్యూ ఇయర్ వేడుకను చాలామంది వివిధ రూపాల్లో ఆస్వాదిస్తూ ఉంటారు. ఖర్చుకు ఏమాత్రం వెనుకాడరు. ఇక రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తీరే వేరు కదా. కాస్మోపాలిటన్ సిటీగా ఎదిగిన తర్వాత ఇక్కడ రకరకాల సంస్కృతులు విలసిల్లుతున్నాయి.. అయితే ఇదే అదునుగా కొంతమంది న్యూ ఇయర్ వేడుకలను క్యాష్ చేసుకునే పనిలో పడ్డారు. అయితే దీనికోసం వారు ఎంచుకున్న మార్గమే చట్ట వ్యతిరేకం. ఇంకేముంది పోలీసులకు దొరికిపోయారు. ఇప్పుడు ఊచలు లెక్కబెడుతున్నారు. ఇంతకీ వారు చేసిన దారుణం ఏంటంటే..నూతన సంవత్సర వేడుకల్లో మద్యం భారీగానే అమ్ముడు పోతుంది. అయితే మద్యానికి మించి కిక్కు కోరుకునే వారు మాత్రం మాదకద్రవ్యాలను ఆశ్రయిస్తూ ఉంటారు. ఇందులోనూ రకరకాల మాదకద్రవ్యాలు ఉంటాయి. అయితే అలా నూతన సంవత్సర వేడుకల కోసం సరఫరా చేసేందుకు మాదకద్రవ్యాల ను తయారు చేస్తున్న ఒక ముఠాను తెలంగాణ నార్కోటిక్ బ్యూరో అధికారులు పట్టుకున్నారు. వారు చేస్తున్న కార్యకలాపాలను అడ్డుకున్నారు. ఏకంగా మూడు కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే పోలీసుల విచారణలో విస్తు పోయే వాస్తవాలు కళ్లకు గట్టాయి.



హైదరాబాదులో మాదకద్రవ్యాలు అనేది కొత్త కాకపోయినా.. ఇన్నీ రోజులపాటు మాదకద్రవ్యాలను ఇతర ప్రాంతాలనుంచి తీసుకొచ్చి ఇక్కడ విక్రయించేవారు. అయితే ఇప్పుడు కొందరు హైదరాబాదులోనే తయారీకి తెర లేపారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో, సంగారెడ్డి పరిధిలోని పారిశ్రామిక వాడల్లో మూతపడిన పరిశ్రమలను ఎంచుకొని వాటిల్లో అత్యంత రహస్యంగా మాదకద్రవ్యాలను సిద్ధం చేస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఈ దందా కొనసాగుతోంది. అయితే దీనిపై విశ్వసనీయ సమాచారం అందడంతో అధికారులు రంగంలోకి దిగారు.సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల పరిధిలో మూతపడిన పరిశ్రమలలో గుట్టుగా డ్రగ్స్ తయారు చేస్తున్నారు. వీటికోసం రకరకాల రసాయనాలు వినియోగిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం పోలీస్ అధికారులు ఆ మూతపడిన పరిశ్రమలపై దాడి చేసి డ్రగ్స్ తయారీ కోసం వాడుతున్న రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని తయారు చేస్తున్న వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న సరుకు విలువ మూడు కోట్ల దాకా ఉంటుందని సమాచారం. గతంలో ఈ ముఠా సభ్యులు ఇలాగే మూతపడిన పరిశ్రమలో డ్రగ్స్ తయారుచేసి అధికారులకు చిక్కారు. జైలు నుంచి బయటికి వచ్చిన అనంతరం ఇలా డ్రగ్స్ తయారుచేసి హైదరాబాద్ తో పాటు ఇతర నగరాలకు సరఫరా చేస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. జిన్నారం మాత్రమే కాకుండా నాచారం పారిశ్రామిక వాడలోనూ ఇదే తీరుగా డ్రగ్స్ తయారు చేస్తున్నారు. పోలీసుల విచారణలో ఈ విషయం వెలుగు చూసింది.. అయితే ఈ డ్రగ్స్ తయారీ వెనుక చెన్నైకి చెందిన నెపోలియన్ ఉన్నట్టు తెలుస్తోంది. అయితే గతంలో పోలీసు అధికారులు అరెస్ట్ చేసిన స్మగ్లర్లతో వీరికి ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే న్యూ ఇయర్ వేడుకలకు ముందే పోలీసులు ఈ డ్రగ్స్ రాకెట్ ను చేదించిన నేపథ్యంలో.. గతంలో డ్రగ్స్ అమ్ముతూ పట్టుబడిన వారంతా అజ్ఞాతంలోకి వెళ్ళినట్టు తెలుస్తోంది

## చల్లా రంగయ్యకు నివాళులర్పించిన రాష్ట్ర సర్పంచ్ ల ఫోరం ఉపాధ్యక్షులు వెంకట్..



తల్లాడ, డిసెంబర్ 12 (ప్రజాపాలన న్యూస్):తల్లాడ మాజీ ఎంపీపీ చల్లా రంగయ్య సోమవారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు నారపోగు వెంకట్ హాజరై ఆయన భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎంపీపీ రంగయ్య నారపోగు వెంకట్ కు విద్యనేర్పిన గురువు కావడంతో ఆయనకు అనారోగ్య విషయం తెలుసుకున్న తాను వెంటనే దగ్గరుండి కిమ్స్ హాస్పిటల్ లో మెరుగైన వైద్య సేవలు అందించారు. అయినా కూడా ఆయన ఆకస్మిక మరణం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర రెవిన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆ కుటుంబానికి అండగా ఉంటారని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ఆయన 10వేల రూపాయలను ఆర్థిక సాయం అందించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా నాయకులు తాతా భాస్కరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వర్లు, పొన్నం కృష్ణయ్య, తాళ్ల జోసెఫ్, గోపాలపేట సర్పంచ్ నల్లమోతు మోహన్ రావు, అయినాల రామలింగేశ్వర రావు తదితరులు ఉన్నారు.

# ఒక్కసారి అవకాశం ఇస్తే...

హైదరాబాద్, డిసెంబర్ 12,: రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించారు. సీఎంగా బాధ్యతలను స్వీకరించిన తర్వాత వేస్తున్న అడుగులు ఆయన పదవిలో పాతుకుపోవడానికే ఎక్కువగా శ్రమిస్తున్నట్లు అర్థమవుతుంది. ఒక్కసారి అవకాశమిస్తే చాలు.. రేవంత్ మరొకరికి అవకాశం ఇవ్వడన్న పేరుంది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కేవలం ఐదు రోజులే అవుతున్నా ఎంతో మెచ్యూరిటీని ఆయన ప్రదర్శిస్తూ పలువురి మన్ననలను పొందుతున్నారు. ముఖ్యంగా సీఎంగా తాను ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలుత ప్రగతి భవన్ జ్యోతిరావు పూలే భవన్ గా మార్చి అందులో ప్రజా దర్బార్ ను నిర్వహించారు. ఉదయం పది గంటల సమయం నుంచి ఓపిగ్గా ప్రజలతో మమేకమై వారి నుంచి వినతులను స్వీకరించారు. అంతకు ముందే సచివాలయంలో ఆయన మంత్రి వర్గ సమావేశం ఏర్పాటు చేసుకుని కీలక శాఖలపై సమీక్ష నిర్ణయించారు. ముఖ్యంగా విద్యుత్తు శాఖలో జరిగిన ఒప్పందాలు, కోట్లాది రూపాయలు ఖర్చు అయిన వైనంపై ఆయన విచారణకు కూడా



ఆదేశించారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను సమీక్షించారు. విద్యుత్తు ఒప్పందాలలో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయని ఆయన ఎన్నికల సందర్భంగా ఆరోపించిన నేపథ్యంలో ఈ దిశగా ఆయన చర్యలకు ఉపక్రమించినట్లయింది. అంతేకాకుండా వివిధ శాఖలపై జరిగిన ఆర్థిక లావాదేవీలపై కూడా శ్వేత పత్రాలను విడుదల చేయడానికి రేవంత్ టీం సిద్ధమవుతుంది. ఇక మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాలుజారి పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన వద్దకు వెళ్లి పరామర్శించి రేవంత్ మరికొంచెం రాజకీయ పరిణితిని ప్రదర్శించారు. రాజకీయాల్లో విధానాలు వైరుధ్యం తప్ప వ్యక్తిగత ద్వేషాలకు తాను ఇవ్వనన్న సంకేతాలను బలంగా బయటకు పంపాడు. పార్టీ కింది స్థాయి క్యాడర్ కు కూడా అదే సిగ్నల్స్ పంపి గ్రామాల్లో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడగలిగారు. ఇక ప్రజావాణి కార్యక్రమాన్ని పునరుద్ధరించి ప్రజాసమస్యలను పరిష్కరించడానికి కూడా రేవంత్ ప్రభుత్వం సిద్ధమయింది. ప్రమాణ స్వీకారం చేసిన రెండో రోజే ముఖ్యమైన రెండు గ్యారంటీలను అమలు చేసి కొంత ప్రజల్లో నమ్మకాన్ని తెచ్చుకోగలిగింది.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు, ఆరోగ్యశ్రీ పరిమితిని పది లక్షలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో రానున్న కాలంలో కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు, మ్యానిఫెస్టోలో పేర్కొన్న అంశాలు గ్రౌండ్ చేస్తారన్న అభిప్రాయం జనాల్లో వ్యక్తమవుతుంది. పాజిటివ్ వేవ్ తో రేవంత్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగాలని భావిస్తున్నట్లుంది. అయితే కేవలం ఐదు రోజుల్లో అంచనా వేయడం సరైన పద్ధతి కాకపోయినా.. వేస్తున్న అడుగులు మాత్రం తాను పదవిలో పాతుకు పోవడానికే నిర్ణయించుకున్నారన్నది మాత్రం సుస్పష్టం. కాంగ్రెస్ హైకమాండ్ తో పాటు ఇటు పార్టీ నేతలు, క్యాడర్ కు కూడా ఎలాంటి అవకాశాలు ఇవ్వకుండా ముందుకు వెళ్లాలన్నది రేవంత్ ఆలోచనగా ఉన్నట్లు అర్థమవుతుంది. చూద్దాం.. రానున్న కాలంలో రేవంత్ వేసే అడుగులు.. మరెన్ని సంచలనాలను నమోదు చేస్తాయో.

## జగన్‌కి, రేవంత్ కి తేడాపై చర్చలు

హైదరాబాద్, డిసెంబర్ 12, :తెలంగాణ కొత్త ముఖ్యమంత్రిగా ఎ రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే.., ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డితో ప్రత్యేకించి ప్రజలకు అనుకూలమైన పాలనా విధానం విషయంలో పోలికలు మొదలయ్యాయి. సంక్షేమ పథకాల అమలులో కొన్ని మీడియా సంస్థలు రేవంత్ రెడ్డి , ఆంధ్రప్రదేశ్ సీఎం వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి మధ్య సమాంతరాలను కూడా చూపడం మొదలుపెట్టాయి.జగన్ , రేవంత్ ఇద్దరూ పరిపాలనలో సాపేక్షంగా కొత్తవారు అయినప్పటికీ, వారు తమ సామర్థ్యాలను , పాలన , పార్టీ నిర్వహణలో సమర్థతను



వేగంగా ప్రదర్శించారు. పరిపాలన సజావుగా సాగేందుకు సీనియర్ నేతలతో చర్చలు జరిపారు. అయితే, ప్రతిపక్ష పార్టీల పట్ల వారి వైఖరిలో గణనీయమైన వ్యత్యాసాన్ని పరిశీలకులు గమనిస్తున్నారు.టీడీపీతో పాటు దాని అనుబంధ మీడియా సంస్థల పట్ల జగన్ మొదటి నుంచి ప్రతీకార వైఖరిని అవలంభించారు. గత టీడీపీ ప్రభుత్వం తీసుకున్న అన్ని నిర్ణయాలను ఆయన తక్షణమే క్షుణ్ణంగా సమీక్షించి, రాజకీయ ప్రతీకార చర్యను స్పష్టంగా ప్రదర్శించారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు నివాసం పక్కనే ఉన్న ప్రజా వేదికను జగన్ వేగంగా కూల్చి, నిబంధనల ఉల్లంఘనగా ప్రకటించారు. ఆయన పదవీకాలంలో చంద్రబాబు తీసుకున్న కీలక నిర్ణయాలను తిరస్కరించారు, రాజధాని నగరం అమరావతికి సంబంధించిన వాటితో సహా, తన స్వంత పథకాలను ప్రవేశపెట్టడం , టీడీపీ నాయకులపై కేసులతో వేట ప్రారంభించారు.తెలంగాణలో రేవంత్ రెడ్డి భిన్నమైన ధోరణిని అవలంభించారు. ఎన్నికల సమయంలో కె చంద్రశేఖర్ రావు ప్రభుత్వం తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలపై సమీక్షిస్తానని హామీ ఇచ్చినప్పటికీ, గతంలో 2015లో ఓటుకు నోటు కేసులో తనను జైలుకు పంపిన కేసీఆర్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు రేవంత్ తొందరపడలేదు. మొదటి రోజునే రేవంత్ ప్రగతిభవన్ ఇనుప గ్రిల్స్ తొలగించి ప్రగతి భవన్ గేట్లను కూల్చివేశారు, అయితే భవనం పేరును మార్చేశారు. దానికి జ్యోతిబా పూలే ప్రజా భవన్ అని పేరు పెట్టారు. మరుసటి రోజు ప్రజలతో దర్బార్ నిర్వహించారు.

# కోదండరామ్ కు రాజ్యసభ..!

హైదరాబాద్, డిసెంబర్ 12, :లంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను రాజ్యసభకు పంపేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోందని సమాచారం. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఆయనకు అవకాశం కల్పిస్తారని తెలుస్తోంది. వచ్చే ఏడాది ఏప్రిల్ రెండో తేదీతో రాష్ట్రానికి సంబంధించిన ముగ్గురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం పూర్తవుతుంది. పదవీ కాలం పూర్తి చేసుకుంటున్న వారిలో వద్దిరాజు రవిచంద్ర, బడుగుల లింగయ్య యాదవ్, జోగినపల్లి సంతోష్ కుమార్ ఉన్నారు. ప్రస్తుతం శాసన సభలో ఉన్న సభ్యుల సంఖ్యాబలం దృష్ట్యా ఇందులో రెండు స్థానాలు కాంగ్రెస్ కు దక్కే అవకాశం ఉంది. వాటిలో ఒకటి ప్రొఫెసర్ కోదండరాం కు కేటాయిస్తారని తెలుస్తోంది.ఎన్నికలకు ముందు కరీంనగర్ లో ప్రొఫెసర్ కోదండరాం ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పొత్తులో భాగంగా నాలుగు అసెంబ్లీ స్థానాలను తమకు కేటాయించాలని కోరారు. దీనిపై స్పందించిన అధినాయకత్వం ప్రస్తుతానికి ఇవ్వలేమని పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యసభకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఏప్రిల్ లో ఖాళీ అయ్యే పోస్టుల్లో ఒకటి కోదండరాం కు కేటాయిస్తారు. మరో పోస్టు కోసం భారీగానే పోటీ ఉందని తెలుస్తోంది. ఆ ఒక్క స్థానాన్ని ఎవరికి కేటాయిస్తారనేది హాట్ టాపిక్ గా మారింది. ఖమ్మం మాజీ ఎంపీ రేణుకా చౌదరి తనకు కేటాయించాలని కోరుతున్నారు. ఇటీవల ఓడిపోయిన సీనియర్లు కొంత మంది తమను గుర్తించాలని కోరుతున్నారు. 2023 తెలంగాణ ఎన్నికల్లో తెలంగాణలో నర్సంపేట, సూర్యపేట, జహీరాబాద్, ఎల్లారెడ్డి, ముథోళ్, కోరుట్ల, గద్వాల సీట్లలో తమ అభ్యర్థులను బరిలో దింపేందుకు తెలంగాణ జన సమితి సిద్ధమయింది. కాంగ్రెస్ తో పొత్తు సందర్భంగాను ఈ సీట్లలో పోటీ చేస్తామని ఆ పార్టీ పెద్దల ముందు



ప్రతిపాదించింది. అయితే సర్వేల్లో తెలంగాణ జన సమితి అభ్యర్థులు గెలిచే అవకాశాలు లేవని తేలడంతో కాంగ్రెస్ అధినాయకత్వం కోదండరాంను రాజ్యసభకు పంపుతామని, ఈ ఎన్నికల్లో టీజేఎస్ అభ్యర్థులను పోటీకి నిలపకుండా తమకు మద్ధతు ఇవ్వాలని కాంగ్రెస్ అధినాయకత్వం కోరినట్లు సమాచారం. అయితే ఈ ఎన్నికల్లో కోదండరాం పోటీ చేస్తానంటే మంచిర్యాల, హన్మకొండ, జనగాం స్థానాల్లో ఎక్కడి నుండైనా పోటీ చేయవచ్చని కాంగ్రెస్ ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. అయితే తానొక్కడినే పోటీ చేస్తే అది పార్టీలో చెడు సంకేతానికి దారి తీస్తుందని, ఈ ఎన్నికల్లో పోటీ చేయకుండా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ కు మద్ధతుగా ప్రచారం చేస్తేనే మంచిదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అందుకే సీట్ల గురించి ఆలోచించకుండా మద్దతు తెలిపారు. టీజేఎస్ కు ఒక రాజ్య సభ, రెండు ఎమ్మెల్సీలు, ఐదు కార్పోరేషన్ పదవులు ఇచ్చేందుకు కాంగ్రెస్ అధినాయకత్వం హామీ ఇచ్చిందని అంటున్నారు. పదవులన్నింటిపై రాష్ట్ర నాయకత్వంతో కాకుండా కాంగ్రెస్ అధినాయకత్వంతోనే చర్చలు జరిగినట్లు టీజేఎస్ నేతలు చెబుతున్నారు. ముందు ముందు టీజేఏసీ నాయకులకూ పదవులు లభించే అవకాశం ఉంది.

## భారీగా తగ్గిన చికెన్ ధరలు



హైదరాబాద్, డిసెంబర్ 12,: తెలంగాణలో ఎన్నికల ముగియడం, కార్తీక మాసం ప్రభావంతో చికెన్ ధరలు అమాంతం పడిపోయాయి. రెండు నెలల క్రితం రూ.300 వరకు పలికిన చికెన్ ధరలు సగానికి తగ్గాయి.చికెన్ ధరలు తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు భారీగా తగ్గాయి. కార్తీక మాసం ఎఫెక్ట్ తో చికెన్ ధరలు పడిపోయాయి. ఇటీవల వరకు ఎన్నికల హడావుడితో ధరలు పెరిగినా...మళ్లీ తగ్గుముఖం పట్టాయి. ముఖ్యంగా కార్తీక మాసంలో మాంసాహారానికి దూరంగా ఉండడంతో చికెన్ ధరలు సగానికి తగ్గాయని వ్యాపారులు అంటున్నారు. రంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం కిలో చికెన్ ధర స్కిన్ రూ.138, స్కిన్ లెస్ రూ.157 పలుకుతోంది. అయితే ధరలు ఇంకా తగ్గే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. ఎన్నికల కారణంగా నవంబర్ కిలో చికెన్ ధర రూ.200 వరకు పలికింది.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సైతం మాంస ప్రియులు చికెన్ కు దూరంగా ఉంటున్నారు. రెండు, మూడు నెలల క్రితం కిలో రూ.300 దాటిన చికెన్ ధరలు...ఇప్పుడు అమాంతం తగ్గిపోయాయి. కిలో చికెన్ ధర 120 నుంచి 140లకు పడిపోయింది. దీంతో మాంసం ప్రియులు పండుగ చేసుకుంటున్నారు. కిలో తీసుకునే బదులు రెండు మూడు కిలోలు చికెన్ వంటకాలు ఎంజాయ్ చేస్తున్నారు. అయితే చికెన్ ధరలు భారీగా తగ్గడంతో పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం మేత పెట్టుబడి రావడంలేదని వాపోతున్నారు. ఎన్నికలు, న్యూ ఇయర్ దృష్టిలో పెట్టుకుని లక్షల్లో పెట్టుబడులు పెట్టిన పౌల్ట్రీ రైతులు నష్టాలను చూస్తున్నారు. ఒక్కసారిగా రేటు పడిపోవడంతో కనీసం గిట్టుబాటు ధరలు రావడంలేదంటున్నారు.వారంలో కార్తీక మాసం పూర్తి కావడంతో పాటు, క్రిస్టమస్, న్యూ ఇయర్ వేడుకలు ఉండడంతో చికెన్ రేట్లు మళ్లీ పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంటున్నారు. మరో పదిహేను రోజుల్లో కోళ్ల రేట్లు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. పౌల్ట్రీ రైతుల వద్ద కోళ్లు భారీగా ఉండడంతో చికెన్ కేంద్రాలకు కోళ్లను విక్రయిస్తున్నారు. కోళ్లను ఫారాల్లో ఎక్కువ రోజులు పెంచితే మేత ఖర్చుతో పాటు, వాటికి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది కాబట్టి పౌల్ట్రీ రైతులు కోళ్లను తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. మార్కెట్‌లోకి భారీగా కోళ్లు రావడంతో చికెన్ ధరలు తగ్గుముఖం పట్టాయి. డిసెంబర్ నెలాఖరులో చికెన్ ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. జనవరిలో సంక్రాంతి పండుగకు చికెన్ ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఏపీలో కూడా చికెన్ ధరలు భారీగా తగ్గాయి. పలు జిల్లాల్లో కిలో చికెన్ ధరలు రూ.140 నుంచి రూ.150 వరకు ఉన్నాయి



## స్ట్రీమింగ్ కి వచ్చేసిన "లియో" ఇంగ్లీష్ వెర్షన్.!



ఇళయ దళపతి విజయ్ హీరోగా త్రిష హీరోయిన్ గా దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన లేటెస్ట్ యాక్షన్ డ్రామా చిత్రం "లియో" కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ భారీ చిత్రం అనేక అంచనాలు నడుమ వచ్చి పర్వాలేదు అనిపించింది. మరి ఈ చిత్రం ఓటిటిలోకి వచ్చిన తర్వాత కూడా భారీ రెస్పాన్స్ ని అయితే అందుకుంది. మరి నెట్ ఫ్లిక్స్ వారు ఈ చిత్రాన్ని మొదటగా పాన్ ఇండియా భాషల్లో ఇండియా అలాగే గ్లోబల్ గా కూడా చిన్న మార్పులతో తీసుకొచ్చారు.మరి ఈ చిత్రం ఇంగ్లీష్ లో కూడా డబ్ చేసి రిలీజ్ చేస్తామని అప్పుడే నెట్ ఫ్లిక్స్ కన్ఫర్మ్ చేయగా ఇప్పుడు నేటి నుంచి అయితే ఇంగ్లీష్ డబ్బింగ్ వెర్షన్ ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చేసారు. మరి ఇంగ్లీష్ వెర్షన్ లో చూడాలి అనుకుంటే ఇప్పుడు నెట్ ఫ్లిక్స్ లో ఈ చిత్రాన్ని ట్రై చేయవచ్చు. ఇక ఈ భారీ చిత్రానికి అనిరుద్ సంగీతం అందించగా 7 స్క్రీన్ స్టూడియోస్ వారు నిర్మాణం వహించారు.

## మన్సూర్ అలీఖాన్ కి కోర్ట్ చీవాట్లు.!



ఇటీవల తమిళ సినిమాకి చెందిన ప్రముఖ నటుడు మన్సూర్ అలీఖాన్ విషయంలో ఎంత రచ్చ నడిచిందో నడిచిందో తెలిసిందే. దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన "లియో" సినిమాలో తాను నటించగా ఆ సినిమా హీరోయిన్ త్రిష పై చేసిన వ్యాఖ్యలకి గాను అతనిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. అయితే ఈ వ్యాఖ్యల్లో తనని అవమానించారని త్రిష కుష్బూ అలాగే మెగాస్టార్ చిరంజీవి లపై కేసు వేస్తున్నట్టుగా తాను తెలిపి కేసు వేసాడు.అయితే ఈ కేసు విషయంలో తమిళనాడు న్యాయస్థానం చురకలు పెట్టింది. మీరు ప్రతిసారి ఏదొక కాంట్రవర్సీ చేసి ఇరుక్కోవడం పైపెచ్చు మళ్ళీ అందులో మీరే అమాయకుడు అంటూ తిరిగి కేసు వేసుకున్తున్నారు అని నిజానికి త్రిష తనని నీ మీద కేసు వేయాల్సింది అని మద్రాస్ హై కోర్ట్ మన్సూర్ కేసుని కొట్టేస్తూ చీవాట్లు పెట్టింది. దీనితో ఈ న్యూస్ విన్న తెలుగు మరియు తమిళ ఆడియెన్స్ మన్సూర్ కి ఇలా జరగాల్సిందే అని అనుకుంటున్నారు.

## దావా వేయాల్సింది మన్సూర్ కాదు త్రిష



బహిరంగ ప్రదేశంలో కించపరిచే వ్యాఖ్యలు చేయడాన్ని తప్పు పడుతూ నటుడు మన్సూర్ అలీఖాన్ కు మద్రాస్ హైకోర్టు మొట్టికాయలు వేసింది. ఆ మేరకు సోమవారం నాడు కోర్ట్ హెచ్చరికలు సినీవర్గాల్లో చర్చకు తెర లేపాయి. మన్సూర్ అనంబద్ధమైన అలవాటైన వివాదాస్పద వ్యాఖ్యలు సరికాదంటూ కోర్టు మండిపడింది. సోమవారం నాడు నటి త్రిష, ఖుష్బు నటుడు చిరంజీవిపై దాఖలు చేసిన పరువు నష్టం దావా విచారణకు రాగా.. జస్టిస్ ఎన్ సతీష్ కుమార్ ''వాస్తవానికి, ఇది నటి త్రిష దాఖలు చేయాల్సింది! మీరు ఎందుకు దాఖలు చేశారు? 'అంటూ మన్సూర్‌ని న్యాయమూర్తి ప్రశ్నించారు.మాట్లాడేప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలి! అని న్యాయమూర్తి అన్నారు. ఇతరులపై అవాంఛనీయ వ్యాఖ్యలు తరచుగా చేస్తున్నందున మన్సూర్ కి న్యాయమూర్తి మొట్టికాయలు వేసారు. మీడియాతో తరచుగా మాట్లాడటం.. కోర్టు వివాదం తప్ప వేరే పని లేదా? అని న్యాయమూర్తి అడిగారు. త్రిషను టార్గెట్ చేసినందుకు తనపై పోలీసులు నమోదు చేసిన కేసులో అరెస్టు నుండి తప్పించుకున్నందుకు మన్సూర్ అలీ ఖాన్ త్రిషకు బేషరతుగా క్షమాపణలు చెప్పారా? అని కూడా న్యాయమూర్తి ఈ సందర్భంలో ఆశ్చర్యపోయారు. అంతేకాకుండా వ్యాఖ్యలు చేసేటప్పుడు ఇతరుల గౌరవాన్ని కాపాడాలని .. అతడు పబ్లిక్‌లో ఏ వ్యాఖ్యలు చేస్తున్నాడో తెలుసుకోవాలని మన్సూర్ కి మీరు సలహా ఇవ్వాలని అతడి తరపు న్యాయవాదికి జడ్జి గారు సూచించారు. 'సలార్' పాత పుకార్లపై నిర్మాత క్లారిటీ సోషల్ మీడియాలో తనకు వ్యతిరేకంగా సందేశాలు పెట్టి తన ఇమేజ్‌కి చెడ్డపేరు తెచ్చినందుకు ప్రతి ఒక్కరి నుండి కోటి రూపాయల నష్టపరిహారం కోరుతూ మన్సూర్ అలీఖాన్ దాఖలు చేసిన పరువు నష్టం దావాపై సమాధానం ఇవ్వాలని ఆదేశిస్తూ త్రిష, ఖుష్బు, చిరంజీవిలకు న్యాయమూర్తి నోటీసు ఇచ్చారు. పిటిషన్ తదుపరి విచారణను డిసెంబర్ 22కి వాయిదా వేసింది. లియో కోస్టార్ త్రిషపై అవాంఛనీయ వ్యాఖ్యలు చేయడంతో మన్సూర్ అలీ ఖాన్ ఇటీవల ఇబ్బందుల్లో పడ్డాడు. పెద్ద ఎత్తున అతడు విమర్శలు ఎదుర్కొన్నాడు. పోలీసులు అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తదనంతరం అతడు త్రిషకు బేషరతుగా క్షమాపణలు చెప్పాడు.

## 'సలార్' పాత పుకార్లపై నిర్మాత క్లారిటీ

ప్రభాస్ అభిమానులతో పాటు పాన్ ఇండియా రేంజ్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రం 'సలార్'. ఈ సినిమాకు కేజీఎఫ్ మేకర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించడం వల్ల అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. ఎప్పుడెప్పుడా అంటూ ఎదురు చూస్తున్న ఈ సినిమా ను క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 22న ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్న విషయం తెల్సిందే. ఆ సమయంలో కొన్ని మీడియా సంస్థలు ప్రచురితం చేసిన కథనాల కారణంగా సలార్ నిజంగానే ఉగ్రం రీమేక్ అయ్యి ఉంటుందని చాలా మంది భావించారు. తాజాగా ఆ పాత పుకార్లపై నిర్మాత విజయ్ కిరగందూర్ క్లారిటీ ఇచ్చారు. రెండు ప్రాజెక్ట్ ల మధ్య ఎలాంటి సంబంధం లేదు. సలార్ చిత్రం చాలా స్పెషల్ మూవీ అన్నట్లుగా ఆయన పేర్కొన్నాడు. ఇప్పటికే మీడియాలో వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవం అని కూడా నిర్మాత మరోసారి క్లారిటీ ఇచ్చాడు. దాంతో ఆ పుకార్లకు చెక్ పెట్టినట్లు అయింది. ప్రభాస్ కి జోడీగా ఈ సినిమాలో శృతి హాసన్ నటించిన విషయం తెల్సిందే. కీలక పాత్రల్లో



పృథ్వీరాజ్ సుకుమారన్, జగపతిబాబు, శ్రియా రెడ్డి, ఈశ్వరీ రావు ఇంకా పాన్ ఇండియా క్రేజీ స్టార్స్ ఈ సినిమాలో నటించారు. సౌత్ లో అన్ని భాషలతో పాటు హిందీలో ఈ సినిమాను భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు.

## KGF వెంకటేష్ మహా.. మళ్ళీ మండింది



యశ్ హీరోగా నటించిన కేజీఎఫ్ సినిమాపై దర్శకుడు, నిర్మాత వెంకటేశ్ మహా అప్పట్లో చేసిన వ్యాఖ్యలు వైరలైన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఆయనపై విపరీతంగా ట్రోల్స్ వచ్చాయి. వాటికి క్లారిటీ కూడా వచ్చారయన. అయితే తాజాగా ఎక్స్( అప్పటి ట్విట్టర్ ) వేదికగా తనను ట్రోల్స్ చేస్తున్న వాళ్లకు గట్టిగా వార్నింగ్ ఇచ్చారు వెంకటేశ్ మహా. అసలేమైందంటే..ఆ తర్వాత ఉమామహేశ్వర ఉగ్రరూపస్య తీశారు. అయితే ఆయనలో దర్శకుడు మాత్రమే కాదు.. నటుడు నిర్మాత కూడా ఉన్నారు. సంపూర్ణేశ్ బాబు హీరోగా నటించిన మార్టిన్ లూథర్ కింగ్ మూవీని ఆయనే సమర్పించారు. నాని అంటే సుందరానికి సినిమాలో కూడా యాక్ట్ చేశారు.ఆయన ట్వీట్ కు ఓ నెటిజన్ రెండు సినిమాలు తీసి కేజీఎఫ్ మీద కామెంట్లు చేశారని విమర్శించారు. దీంతో వెంకటేశ్ అతడికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. "వదిలేస్తే మాట వినరుగా మీరు. సరే చెప్తున్నా వినండి. ఎన్ని సినిమాలు తీశాం అనేది ముఖ్యం కాదు. ఏం సినిమా తీశాం అనేది ముఖ్యం. తెలుగులోని బెస్ట్ సినిమాల్లో కొన్ని నేను తీశానని గర్వంగా చెప్పుకుంటున్నాను. ఇంకా బెస్ట్ సినిమాలు తీస్తాను. ఊరుకుంటున్నాం కదా అని పిచ్చి పిచ్చిగా మాట్లాడితే ఇంక ఊరుకోను" అని వెంకటేశ్ ట్వీట్ చేశారు.సోషల్ మీడియా వేదికగా తనపై వస్తున్న ట్రోల్స్ పై పోరాటం చేస్తానని చెప్పారు. చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటానని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ఎవరనేది తెలియకుండా, తమ ముఖాన్ని బయట పెట్టకుండా పోస్టులు చేస్తున్న వ్యక్తులకు బుద్ధి చెప్పే క్రమంలో తనను అండగా నిలబడాలని ఆయన కోరారు. కొన్ని నెలల క్రితం వెంకటేశ్ మహా ఓ చర్చా వేదికలో పాల్గొన్నారు. ఆ సమయంలో ఆయన కేజీఎఫ్‌పై కామెంట్స్ చేశారు. 'తల్లి కలను నెరవేర్చడం కోసం బంగారాన్ని సంపాదించి చివరికి ఆ మొత్తాన్ని సముద్రంలో పడేశాడు. అలాంటి వ్యక్తి గురించి సినిమాలు చేస్తే మనం చప్పట్లు కొడుతున్నాం' అంటూ వ్యాఖ్యలు చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై నెటిజన్లు, ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పట్లో ఇది చర్చనీయాంశం కాగా.. తాను ఓ ఇండస్ట్రీని కించపరిచేందుకు అలా మాట్లాడలేదని, సినిమాలోని కల్పిత పాత్రనే తప్ప వ్యక్తిని దూషించలేదని వెంకటేశ్ అప్పుడే క్లారిటీ ఇచ్చారు. ఇప్పుడు నెటిజన్ కామెంట్ వల్ల మరోసారి నెట్టింట ఆ చర్చ మొదలైంది.



## ఎన్టీఆర్ 'వార్' మొదలుపై గందరగోళం



ఎన్టీఆర్ ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో దేవర సినిమా ను చేస్తున్న విషయం తెల్సిందే. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న దేవర సినిమా ను రెండు భాగాలుగా విడుదల చేయబోతున్నట్లుగా అధికారికంగా ప్రకటన వచ్చింది. దేవర సినిమా మొదటి భాగం షూటింగ్ పూర్తి అయిన వెంటనే వార్ 2 షూటింగ్ లో ఎన్టీఆర్ పాల్గొనాల్సి ఉంది. 'వార్ 2' సినిమా షూటింగ్ కి 2024 జనవరిలో ఎన్టీఆర్ జాయిన్ అవ్వాల్సి ఉంది. అందుకు తగ్గట్లుగా మొదట ఎన్టీఆర్ తన దేవర సినిమా ను 2023 డిసెంబర్ లో ముగించాలని భావించారు. కానీ ఇప్పుడు ఎన్టీఆర్ దేవర సినిమాను 2024 ఫిబ్రవరి లేదా మార్చి వరకు చేసే అవకాశాలు ఉన్నాయంటూ వార్తలు వస్తున్నాయి. దాంతో వార్ 2 ఎప్పుడు అనే చర్చ మొదలైంది. ఇంతకు ఎప్పుడు వార్ 2 మొదలు అవ్వబోతుంది అంటూ ఎన్టీఆర్ ఫ్యాన్స్ లో గందరగోళ వాతావరణం నెలకొంది. ఎన్టీఆర్ వార్ 2 తో హిందీ ఇండస్ట్రీలో అడుగు పెట్టబోతున్నాడు. హిందీ లో ఎన్టీఆర్ తొలి సినిమా అవ్వడంతో ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కానీ షూటింగ్ విషయంలో మేకర్స్ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఫ్యాన్స్ గందరగోళంలో ఉన్నారు. బాలీవుడ్ లో జరుగుతున్న ప్రచారం మేరకు సల్మాన్ ఖాన్ టైగర్ 3 సినిమా ఫలితం నేపథ్యం లో వార్ 2 కి మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారట. అందుకే ఆలస్యం అంటున్నారు. మరి వచ్చే ఏడాది మార్చి లేదా ఏప్రిల్ లో అయినా వార్ 2 మొదలయ్యేనా చూడాలి.

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2/29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989